
## స్మార్ట్ కార్డు పేరుతో రేషన్ డీలర్ల నయా దందా

**బెజ్జంకి,మే 23, ప్రభాతవార్త:** రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ రూ.100 చెల్లించి స్మార్ట్ కార్డును తీసుకోవాలని నాయదందాకు తెరలేపారు గుండారంలో ఒరేషన్ డీలరు. సంబంధితశాఖ నుంచి ఎలాంటి ఉత్తర్వులు లేనప్పటికీ ప్రజల అవసరాన్ని అసరాగ చేసుకొని పాత కార్డుల స్థానంలో నూతన కార్డులను ముద్రిస్తున్నట్లు దానికి గానూ రూ.100 చార్జీ అవుతుందని గత కొద్ది రోజులుగా గుండారం గ్రామంలో కార్డు కలిగిన వారి నుంచి రూ.100 వసూలు చేస్తున్న వైనం మంగళవారం అలస్యంగా వెలుగులోకి వచ్చింది. రూ.100 చెల్లించి కార్డు తీసుకుంటేనే ప్రభుత్వం ఉచి తంగా అందించే రేషన్ బియ్యం తీసుకోవడానికి అర్హులని లేదంటే బియ్యం పంపిణీ చేయబోమని హు కుం జారీ చేసినట్లు సమాచారం.గతంలో మండలంలోని పలుగ్రామాల్లో వ్యవహారం జరిగినట్లు కూడా అరోపణలు వినిస్తున్నాయి. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు లేకుండా నూతన కార్డుల ముద్రణ పేరుతో దోపిడికి తెగ పడ్డ సదరు రేషన్ డీలర్‌పై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. డీలర్ వ్యవహారంపై నాయాబ్ తహశీల్దార్ పార్థసారథిని వివరణ కోరగా నూతన రేషన్ కార్డుల ముద్రణ పేరిట రూ.100 వసూలు చేసినట్లు దృష్టికి వచ్చిందని పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం.



# మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
# వార్త

## చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

**పాపన్నపేట, మే 23, ప్రభాతవార్త:** చేపల వేటకు వెళ్లిన వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం కందిపల్లిలో చోటు చేసుకుంది. ఎస్ఐ విజయ్ నారాయణ్ కుమార్ కథనం ప్రకారం కందిపల్లికు చెందిన పుట్టి ఎల్లయ్య (25) వ్యవసాయ కూలీగా పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మంగళవారం ఉదయం కందిపల్లి చెరువులో చేపల వేటకు మిత్రులతో కలిసి వెళ్లి చూపలు పట్టి అటు వైపు నుంచి ఇవతలి గడ్డకు ఈదుతూ వస్తున్న క్రమంలో చెరువు మద్యలో లోకి వచ్చిన తరుణంలో శ్వాస అందకపోవడంతో నీట మునిగి పోయాడన్నారు. విషయాన్ని గమనించి తోటి మిత్రులు కాపాడేందుకు ప్రయత్నించినా అప్పగికే ఎల్లయ్య నీట మునిగి పోవడంతో ఏమి చేయలేకపోయారు. విషయం తెలసుకున్న కుటుంబ సభ్యులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని చెరువలో నుంచి వెలికి తీసి పంచనామ నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృ తుడి భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్ నారాయన్‌కుమార్ వివరించారు. మృతుడికి భార్య సరితతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

## కర్ణాటక ఫలితాలతో మోడీ గుండెల్లో రైళ్లు

**-సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి**

**హుస్నాబాద్,మే23,ప్రభాతవార్త**

కర్ణాటక ఎన్నికల ఫలితాలతో మోడీ గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం రోజున పట్టణంలోని అణభేరి సింగిరెడ్డిల అమరుల భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితి గందరగోళంగా ఉందన్నారు.కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన నుండి దేశంలో పేద మధ్య తరగతి ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు.కేంద్రం నిత్యవసర వస్తులపై జిఎస్టి విధించి సామాన్యుల నడ్డి విరుస్తోందని మండిపడ్డారు.దేశ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న బిజెపి మోడీ ప్రభుత్వం మూల్యం చెల్లించకతప్పదన్నారు.ఇక రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకై జూన నాలుగవ తేదీన కొత్తగూడెంలో లక్ష మందితో సిపిఐ పార్టీ గర్జన సభ ఏర్పాటు చేస్తున్నామని ఈ సభకు ఈ ప్రాంతం నుండి ప్రజలు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.గౌరవెల్లి ప్రాజెక్టు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వాసితుల సమస్యలను పూర్తిగా పరిష్కరించలేదని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి భూ నిర్వాసితులకు న్యాయం చేయకపోతే సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మంద పవన్,మండల అధ్యక్షులు గడిపె మల్లేష్,కొమ్ముల భాస్కర్,ముంజగోపి,నాయకులు జాగిరి సత్యనారాయణ,కొమురయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.


## రామాయంపేటను రెవెన్యూ డివిజన్ చేయాలి

**నేడు భారీ ర్యాలీ : జడ్పీటీసీ విజయ్‌కుమార్**

**రామాయంపేట, మే 23, ప్రభాతవార్త :**

పాలకులు, అధికారుల నిర్లక్ష్యం వల్లే రామాయంపేట రెవెన్యూ డివిజన్ రాలేకపోతుందని, ఇక్కడి ప్రధాన సమస్యలు ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి వెళ్లడం లేదని నిజాంపేట జడ్పీటీసీ సభ్యుడు పంజా విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం నాడు రామాయంపేటలో ఆయన విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రామాయంపేటను రెవెన్యూ డివిజన్ చేయాలని, పార్టీలకతీతంగా కుల సంఘాలు, వర్తక, వాణిజ్య, వ్యాపార, యువజన సంఘాలు, అన్ని వర్గాల ప్రజలు కోరుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. రామాయంపేటకు ఎంతో చరిత్ర ఉందని కానీ నేడు ఆ చరిత్ర కనుమరుగవుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రామాయంపేట కేవలం మున్సిపాలిటీగా పేరు మారింది తప్ప, అభివృద్ధి కాకపోవడంతో పాటు ప్రజలపై ట్యాక్సీల భారం పెరుగుతుందని అన్నారు. తక్షణం రామాయంపేట రెవెన్యూ డివిజన్ గా ఏర్పడితే ప్రభుత్వ కార్యాలయాలు రావడంతో పాటు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఆయన తెలంగాణ జాతిపితగా పొగిడారు. అడగకుండా అన్ని ఇచ్చే గొప్ప వ్యక్తి కేసీఆర్ అని అన్నారు. అయితే ముఖ్యమంత్రి దృష్టికి కొంత మంది కొన్ని విషయాలు తీసుకెళ్లలేకపోవడం వల్ల పనులు జరగడం లేదన్నారు. నేను ఎవరిని, నా సొంత పార్టీని కూడా విమర్శించడం లేదని, ప్రజల అభీష్టం మేరకే రెవెన్యూ డివిజన్ కోసం పాదయాత్ర చేపట్టడం జరుగుతుందన్నారు. కావాలని కొందరు నాపై బురద జల్లుతున్నారని ఆరోపించారు. విద్యా, వైద్యంలో రామాయంపేటకు తీరని అన్యాయం జరగడం అందరికీ తెలుసని ఆయన పేర్కొన్నారు. ఇంతవరకు రామాయంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడం శోచనీయమని పేర్కొన్నారు.నేను జడ్పీటీసీగా రాజీనామా చేస్తే, రామాయంపేట డివిజన్ వస్తుందంటే తక్షణమే రాజీనామా చేసి రాజకీ యాలకు దూరంగా ఉంటానని ఆయన ప్రకటించారు. రామాయం పేట ప్రజలు ఇప్పటికైనా మేల్కొనిడివిజన్ కోసం పార్టీలకు అతీతంగా జేఏసీ ఆధ్వర్యంలోనే బుధవారం రోజున పాదయాత్ర చేస్తున్నట్లు, ఈ పాదయాత్రకు రామాయంపేటతో పాటు చుట్టు పక్కల మండలాల ప్రజలు సహకరించి విజయవంతం చేయాలని ఆయన కోరారు.జేఏసీ నాయకులు పుట్టి అక్షయ్‌కుమార్, రమేష్ రెడ్డి, ఎనిశెట్టి అశోక్‌గుప్తా, దోమకొండ యాదగిరి, చింతల శేఖర్, అల్లాడి వెంకటి, సురేష్‌నాయక్, గరుగుల శ్రీనివాస్, చాకలి వెంకటి, రెడ్డమైన నరేష్ పాల్గొన్నారు.

## ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి స్థలం, నిధులు కేటాయించాలి



మంత్రి హరీష్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న యాదవ సంఘం నాయకులు

**గజ్వేల్, మే 23 (ప్రభాతవార్త):** గజ్వేల్ నియోజకవర్గ యాదవ సంఘం నాయకులు మంగళవారం రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావును తన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యాదవ సంఘం నాయకులు నూనె కుమార్‌యాదవ్, వర్గల్ జెడ్‌పిటిసి బాలుయాదవ్, కూచారం రవీందర్‌యాదవ్, తూప్రాన్ ఎంపిపి గడ్డి స్వప్నవెంకటేష్‌యాదవ్‌లు మాట్లాడుతూ నియోజకవర్గ యాదవ భవన్, ఫంక్షన్‌హాల్ నిర్మాణం కోసం స్థలం మరియు నిధులు మంజూరు చేయాలని మంత్రి హరీష్‌రావును కోరినట్లు తెలిపారు. మంత్రి హరీష్‌రావు ఆర్డీఓకు ఫోన్‌చేసి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అడగగానే వెంటనే సానుకూలంగా స్పందించిన మంత్రి హరీష్‌రావుకు, ఆర్డీఓకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.గజ్వేల్ నియోజకవర్గంలోని యాదవ సంఘం నాయకులు యంజాల ఐలేష్‌యాదవ్, కన్నెబోయిన కన్నాయాదవ్, కొమురయ్యయాదవ్, వెంకటేష్‌యాదవ్, వెంకటేష్, కిరణ్, మల్లేశ్, రాజు, బాబుయాదవ్ పాల్గొన్నారు.

# చైర్‌పర్సన్ అవినీతిపై ధ్వజమెత్తిన సొంతపార్టీ కౌన్సిలర్లు



అవినీతిపై మున్సిపల్ చైర్‌పర్సన్‌ను ప్రశ్నిస్తున్న కౌన్సిలర్లు

**సంగారెడ్డి మున్సిపాలిటి, మే 23, ప్రభాతవార్త:** సంగారెడ్డి మున్సిపాలిటీలో జరిగిన అవినీతిపై పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు మున్సిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మిపై ధ్వజమెత్తారు. మంగళవారం సంగారెడ్డి మున్సిపల్ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశం ఏజెండా అంశాలపై చర్చ మొదలు చేసేకంటే ముందు 7వ వార్డు కౌన్సిలర్ బోయిని విజయలక్ష్మి మున్సిపల్ పరిధిలో జరుగుతున్న అవినీతిపై ప్రశ్నించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అవినీతి మూలంగా, బిఆర్ఎస్‌పార్టీ పరువు దిగజార్చుతున్నారని ఆరోపించారు. స్వార్థప్రయోజనాలతో మున్సిపల్‌ను భ్రష్టిపట్టించారని కౌన్సిలర్ వీణా ధ్వజమెత్తారు. పనిచేయకుండా మీ బంధువులకు జీతాలు ఇచ్చింది,నిజమా కాదా అని ప్రశ్నించారు. బంధువులకు మున్సిపల్‌లో ఉద్యోగాలు కల్పించి, పనిచేయకుండానే జీతాలు ఇచ్చారని, పనిచేయకుండా డబ్బులు తీసుకున్న వారినుండి కట్టిస్తారా, మీరు కడతారా అని 7వ వార్డు కౌన్సిలర్ బోయిని విజయలక్ష్మి ప్రశ్నించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్ముడు సంగారెడ్డిలోని పార్కు స్థలంను ఆక్రమించుకున్నాడని అక్రమ మార్గంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని బోయిని విజయలక్ష్మి ఆరోపిస్తూ, రిజిస్ట్రేషన్ పత్రాలను ఆధారంగా చూపించారు. అక్రమించింది నీవు చూశావా అంటూ చైర్‌పర్సన్ తిరిగి ప్రశ్నించారు. పోలీస్‌స్టేషన్‌లోనే తేల్చుకుందామంటూ ఆమె సవాల్ విసిరారు. కౌన్సిల్ సభ్యుల పట్ల ఆగౌరవంగా మాట్లాడుతూ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఏలా చెబుతారని, మేము ఏం చిల్లార రాజకీయాలు చేశామో చెప్పాలని కౌన్సిలర్లు, బోయిని విజయలక్ష్మి, శ్రీకాంత్, సమీలు వీణాలు పట్టుపట్టారు. సమాధానం చెప్పేవరకు, ఏజెండాపై చర్చించేది లేదని స్పష్టంచేశారు.. మున్సిపల్‌లో జరిగిన అవినీతిపై 7వార్డు కౌన్సిలర్ బోయిన విజయలక్ష్మి, మున్సిపల్ చైర్ పర్సన్ బొంగుల విజయలక్ష్మిల మధ్య కొద్దిసేవపు వాడి,వేడిగా వాగ్వివాదం జరిగింది. 7వవార్డు కౌన్సిలర్‌కు మద్దతుగా మరికొంత మంది కౌన్సిలర్లు మద్దతు పలకడంతో సమావేశంలో కొద్దిసేపు స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సరిపోదు,పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేయాల్సింది. ఊరుకుంటే రెచ్చిపోతున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మి పేర్కొన్నారు. రాజకీయహోదాలో ఉండి, బంధువులకు సహయం చేయొద్దని రాజ్యాంగంలో ఉందా అని ఆమె ప్రశ్నించారు. ప్రతినెల పెట్టాల్సిన సమావేశాలు, 7 నెలలకు ఒకసారి పెడితే ఏలా అని కౌన్సిలర్ నాగరాజు ప్రశ్నించారు. ఎస్సీ సభ్యున్ని అయినందున తన వార్డుపై చిన్న చూపు చూస్తున్నారని కౌన్సిలర్ కొత్తపల్లి నాని (శ్రీకాంత్) అధికారుల తీరును ప్రశ్నించారు. నీటిపన్ను 9 కోట్లు, ఇంటిపన్నులవి 3కోట్లు బకాయిలు ఉన్నాయని కమిషనర్ చంద్రశేఖర్ తెలిపారు. పన్నుల వసూళ్ల శాతం తగ్గినందున తనకు మెమో జారీ అయిందని అన్నారు. మున్సిపల్ సమావేశంలో గొడవలు జరుగకుండా జనరల్ (సాధారణ నిధులు) ఫండ్‌నుండి పనులకు నిధులు పెట్టారని కౌన్సిలర్ శేఖర్ అన్నారు. చేసిన పనులకు సంబంధించి బిల్లులు సబ్ మిట్‌చేయాలని సభ్యులు రామప్ప సూచించారు. సమావేవం ప్రారంభంలో శివాజి విగ్రహం పెట్టడానికి అనుమతి కోరుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ తీర్మాణం ప్రవేశపెట్టడంతో కౌన్సిల్ సభ్యుల మధ్య తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుంది.కొద్దిసేపు స్వల్ప ఉద్రిక్తత నెలకొంది.

### పోలీసుల రంగప్రవేశం, మీడియాకు మున్సిపల్ కమిషనర్ క్షమాపణ

#### మీడియాకు మున్సిపల్ కమిషనర్ క్షమాపణ

సంగారెడ్డి మున్సిపల్ సమావేశం సందర్భంగా సమావేశానికి విలేకరులకు అనుమతిలేదని,లోపల ఉన్నవారిని బయటకు పంపించాలని కమిషనర్ పోలీసులను ఆదేశించడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. విలేకరులను రానివ్వకుంటే సమావేశమే జరుగనివ్వమని పలువురు కౌన్సిలర్లు పట్టుబట్టారు. సమావేశంలోనికి పోలీసులను ఏలా రప్పిస్తారని వారు కమిషనర్‌ను ప్రశ్నించారు. తాను పోలీసులను పిలువలేదని బదులిచ్చారు. విలేకరులను బయలకు పంపిచాలని కమీషనర్ పోలీసులను ఆదేశించడం విలేకరులను అవమానపరచడమేనని, కమిషనర్ క్షమాపణ చెప్పాలని విలేకరులు డిమాండ్ చేయడంతో కమిషనర్ క్షమాపణలు చెప్పారు.

#### చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా సొంతి పార్టీ కౌన్సిలర్లు ప్లాకార్డుల ప్రదర్శన

సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మిపై సొంతపార్టీ కౌన్సిలర్లు తిరుగుబాటు జెండా ఎగురవేశారు. మంగళవారం జరిగిన మున్సిపల్ సమావేశానికి ముందు కార్యాలయం ఆవరణలో,మున్సిపల్ చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా ప్లాకార్డులు ప్రదర్శించారు. అవినీతి చైర్‌పర్సన్ రాజీనామ చేయాలి, అవినీతిపై విజిలెన్సు విచారణ జరిపించాలి. అవినీతి చైర్‌పర్సన్ డౌన్,డౌన్ అంటూ నినాదాలు ఇచ్చారు. అవినీతి చైర్మెన్ గద్దెదిగాలి.. అక్రమలపై విచారణ జరపాలి అంటూ నినాదాలిచ్చారు. అవినితి చైర్‌పర్సన్‌డౌన్,డౌన్ అంటూ చైర్మెన్‌కు వ్యతిరేకంగా నినాదాలిస్తూ సమావేశం హాల్లోనికి ప్రవేశించారు.

# నత్తనడకన మన ఊరు మన బడి పనులు

### అసహనం వ్యక్తం చేసిన : కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** జిల్లా మొత్తంలో హుస్నాబాద్ నియోజకవర్గంలో మన ఊరు మన బడి పథకం పనులు నత్తనడకన సాగుతున్నాయని జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్ అసహనం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం హుస్నాబాద్ నియోజకవర్గంతో పాటు బెజ్జంకి మండలానికి చెందిన మన ఊరు మన బడి పథకం కింద కేటాయించిన పాఠశాలల హెచ్ ఎంలు,ఎస్ఎంసి చైర్మనర్లు, ఎంఈవోలు,ఎంపిడిఓలు, ఎపిఓలు, ఇంజనీరింగ్ అధికారులు సర్పంచ్‌లు, కౌన్సిలర్లతో సమీక్షా సమావేశం నిర్వహిం చి మాట్లాడారు. బెజ్జంకి మండలం లో పనులు మరింత మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మన ఊరు మన బడి పథకం పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఎన్ఆర్ఈజీఎస్,ఈజీఎస్ కింద చేసే పనులను ఎంపిడిఓ, ఎంపిఓలు రోజు వారిగా పాఠశాలల్లో జరుగుతున్న పర్యవేక్షణ చేసి పూర్తి చేయించాలన్నారు. పనులు పూర్తి చేసిన పాఠశాలల్లో ఎలాంటి అపరిశుభ్రత లేకుండా చూసుకోవాలన్నారు. మన ఊరు మన బడి పథకం పనుల నిర్మాణంలో ఎవరూ నిర్లక్ష్యం చేసిన సహించే ప్రసక్తి లేదన్నారు. త్వరలోను పాఠశాలలు తిరిగి ప్రారంభం కానుండడంతో పనుల్లో వేగం పెంచాలన్నారు. అధికారులు పనులను ఎప్పటికప్పుడు పర్య వేక్షణ చేయాలన్నారు. మళ్లి సమావేశంలోపు మన ఊరు మన బడి పథకం కింద చేపట్టిన పనులు పూర్తి చేయాలని అధికారులను అదేశించారు. కార్యక్రమంలో డిఆర్డీఎ పిడి చంద్ర మోహన్‌రెడ్డి, డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, అర్అండ్‌బి ఈఈ రాములు తదితరులు పాల్గొన్నారు.

# సబ్ సెంటర్ల పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

### - రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు



మీటింగ్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్

**సంగారెడ్డి బ్యూరో, మే 23, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. మంగళవారం మంత్రి జిల్లా కలెక్టర్లు, వైద్యారోగ్యశాఖ అధికారులు, ఇంజనీరింగ్ విభాగం అధికారులతో జుమ్ మీటింగ్ ద్వారా వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించిన వివిధ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇప్పటికే తొమ్మిది జిల్లాలలో కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేస్తున్నామన్నారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నిర్వహించే హెల్త్ డే రోజున మిగతా 24 జిల్లాలలోని అన్ని నియో జకవర్గ కేంద్రాల్లో న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 6.84 లక్షల మంది గర్బిణీలకు వీటిని అందజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ కిట్ పథకాన్ని అమలు చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించగలిగామని, మాతాశిశు మరణాలను అరికట్టడంలో తెలంగాణ దేశంలోనే మూడవ స్థానంలో ఉందన్నారు. అదేవిధంగా ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు సంఖ్య గణనీ యంగా పెరిగిందన్నారు. గర్భిణీల్లో రక్తహీనతను నివారిస్తూ, పుట్టబోయే శిశువులు ఆరోగ్యవంతంగా ఉండేలా ప్రభుత్వం ప్రస్తుతం న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేయాలని నిర్ణయించిందన్నారు. న్యూట్రిషన్ కిట్ పంపిణీ కార్యక్రమం కూడా మంచి ఫలితాలను అందిస్తుందనే నమ్మకం ఉందని మంత్రి అన్నారు. ఈ సందర్భంగా సబ్ సెంటర్ భవనాల నిర్మాణాల ప్రగతి గురిం చి మంత్రి జిల్లాల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామస్థాయిలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు వీలుగా పల్లె దవాఖానాలు పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. జిల్లాలకు నూ తనంగా మంజూరు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాలు, బస్తి, పల్లె దవాఖా నాలను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. కంటి వెలుగు కార్యక్రమం ద్వారా 80 పని దినాల్లో రాష్ట్రవ్యాప్తంగా కోటిన్నర మందికి కంటి పరీక్షలు నిర్వహించి 38 లక్షల 58 వేల మందికి కంటి అద్దాలు అందించడం జరిగిందని వివరించారు. వేసవి తీవ్ర తను దృష్టిలో పెట్టుకుని ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. సీపీఆర్ శిక్షణ కార్యక్రమంపై వైద్యాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని,సీఆర్పీపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లాకు 2,830 న్యూట్రిషన్ కిట్స్ వచ్చాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ మంత్రికి తెలిపారు. న్యూట్రిషన్ కిట్స్ పంపిణీకి ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలి పారు. ఈ మీటింగ్‌లో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ గాయత్రీదేవి, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ అనిల్‌కుమార్, ఆర్ఎం ఓ సంగారెడ్డి, డాక్టర్ శశాంక్, పంచాయతీరాజ్ ఈఈ జగదీశ్వర్ పాల్గొన్నారు.

# గౌరవెల్లితో హుస్నాబాద్ కరువుకు చరమగీతం : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్

**హుస్నాబాద్,మే23,ప్రభాతవార్త :** గౌరవెల్లి ప్రాజెక్టు ద్వార ఈ ప్రాంతంలో కరువుకు చరమగీతం పాడబోతున్నామని ఎమ్మెల్యే సతీష్‌కుమార్ స్పష్టం చేశారు.మంగళవారం రోజున పట్టణంలోని రాజ్యలక్ష్మి కన్వెన్షన్‌లో మంగళవారం రోజున ఏర్పాటు చేసిన బిఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ గడిచిన తొమ్మిది సంవత్సరాలలో హుస్నాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుని నేడు ఈ ప్రాంతం రూపురేఖలు మార్చుకున్నామన్నారు.హుస్నాబాద్ అభివృద్ధి నా అజెండా అని..అభివృద్ధి సంక్షేమం విషయంలో ఎట్టి పరిస్థితిలోనూ రాజీ పడే ప్రసక్తేలేదని తన కోసం అహర్నిశలు శ్రమిస్తున్న బిఆర్ఎస్ కార్యకర్తలు తన గుండెలో పదిలంగా గూడు కట్టుకుని ఉన్నారని ఉద్వేగభరితంగా హుస్నాబాద్ శాసనసభ్యులు వొడితెల సతీష్‌కుమార్ వ్యాఖ్యానించారు. ఏళ్ళకు ఏళ్ళ నిత్యం కరవు కోరల్లో విలవిలాడిన మెట్టప్రాంతం హుస్నాబాద్ అని ఈ కరవుకు తోడు పంటల దిగుబడి ఆశించిన మేరకు అన్నదాతక దక్కక ఉరికొయ్యలకు వేలాడిన దురదృష్టకర సంఘటనలు కోకొల్లలుగా ఇక్కడ చూశారని ఇలాంటి కరవు పరిస్థితి ఇక తాండవం చేయకూడదని భావించిన తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ రైతాంగానికి సాగునీటి వనరులను అందించడానికి గౌరవెల్లి రిజర్వాయర్‌ను నిర్మించాలని అనాటి విపక్ష పార్టీలు పోరాటం జరిపి శంఖుస్థాపనల పేరిట రాళ్ళు వేసి కాలువలు తవ్వి ఓట్లు దండుకున్న విషయాన్ని గుర్తుచేస్తూ తమ తెలంగాణ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టును నిర్మించి అనతికాలంలోనే ఇక్కడి ప్రజానీకానికి అందించేందుకు సిద్ధం చేశారని గర్వంగా చెప్పారు.

గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణంతో హుస్నాబాద్ నియోజకవర్గంలో కరువు శాశ్వతంగా దూరం కాబోతుందని,హుస్నాబాద్ చరిత్రలోనే గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణం ఒక మైలురాయన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం నిర్వాసితుల సహకారంతో పూర్తి చేసుకున్నామన్నారు.నిర్వాసితుల త్యాగం వెలకట్టలేనిదని వారిని అన్ని రకాలుగా అండగా ఉంటానన్నారు.ఈ ఆత్మీయ సమ్మేళనంలో హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న,వైస్ చైర్మెన్ అయిలేని అనిత్‌శ్రీనివాస్‌రెడ్డి,మార్కెట్ చైర్మెన్ ఎడబోయిన రజిని తిరుపతిరెడ్డి,కౌన్సిలర్లు పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.




డిఆర్‌డిఓతో కలిసి ధాన్యాన్ని పరిశీలిస్తున్న టిపిసిసి రాష్ట్ర నాయకులు ఆంజనేయులుగౌడ్ తదితరులు

## తడిసిన వరిధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలి

**టిపిసిసి రాష్ట్ర నాయకులు ఆంజనేయులుగౌడ్**

**నర్సాపూర్, మే 23.ప్రభాతవార్త:** ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి తడిసిన వరిధాన్యం ను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని టిపిసిసి రాష్ట్ర నాయకులు ఆంజనేయులు గౌడ్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో ని ధాన్యంకొనుగోలు కేంద్రాన్ని డిఆర్‌డిఓ పిడి తో కలిసి ఆయన కొనుగోలు కేంద్రాన్ని పశీరిలించారు. ఈసందర్భంగా టిపిసిసి రాష్ట్ర నాయకులు ఆంజనేయులుగౌడ్ మాట్లాడుతూఅకాల వర్షానికి ఆరుగాలం కష్టించిపండించిన ధాన్యం తడిసి ముద్దయ్యిందన్నారు.ఈ తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.తడిసిన ధాన్యం మ్యాచర్ రాక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మ్యాచర్ తో సంబందం లేకుండా తడిసిన దాన్యం ను తూకం వేయాలన్నారు. క్వింటాళ్ కు 4 నుండి 5 కిలోలు ఎక్కువ తూకం వేస్తున్నారని అలా కాకుండా తూకం సరిగ్గా వేసి రైతులకు న్యాయం చేయాలన్నారు.అంతేగాక వడగండ్ల వర్షానికి పంటలు నష్టపోయిన రైతులకు 20 వేలు నష్ట పరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.ఐకెపి కేంద్రాలు రైస్ మిల్లర్లు తడిసిన ధాన్యం తేమ శాతం సాకుతో నిరాకరిస్తున్నారిన అన్నారు. రైస్‌మిల్లర్లుకు లబ్ధా చేకూర్చేందుకు సిఎం కెసిఆర్ వారితో కుమ్మక్కై రైతులు నష్టం కలిగిస్తున్నారని ఆరోపించారని, ప్రతి గింజను మద్దతు ధరతో కొనుగోలు చేసే వరకు రైతుల కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందన్నారు.రైతులకు అన్యాయం చేస్తె కాంగ్రెస్ పార్టీ ఊరుకునేదిలేదని తెలంగాణ రైతులకు అండగా ఉండి పోరాటం చేస్తుందని టిపిసిసి రాష్ట్ర నాయకులు ఆంజనేయులుగౌడ్ వెల్లడించారు. ఈకార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర నాయకులు ఆంజనేయులుగౌడ్ తోపాటు రైతులు రాములు ప్రమీల,సోమని రాములు బొందిలి శ్రీశైలం, రాయిని రాములు తదితరులు పాల్గొన్నారు.

## కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి పంజాల రవిగౌడ్



కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో పంజాల రవిగౌడ్

**గజ్వేల్, మే 23 (ప్రభాతవార్త):** భువనగిరి పార్లమెంట్ సభ్యుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని తన నివాసంలో గజ్వేల్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పంజాల రవిగౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రవిగౌడ్ మాట్లాడుతూ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తున్నారన్నారు. నల్లగొండ జిల్లాలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మించిన నాయకుడు లేడన్నారు. రానున్న రోజుల్లో రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

## ప్రారంభమైన ఐటిఐ మొదటి విడత ప్రవేశాలు

**హుస్నాబాద్,మే23,ప్రభాతవార్త** పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులతో పాటు పదవ తరగతి పూర్తి చేసి చదువు మానేసిన నిరుద్యోగ యువతకు ప్రభుత్వ,ప్రయివేట్ పారిశ్రామిక శిక్షణ ద్వార 2023-24వ సంవత్సరం ఐటిఐలో మొదటి విడత ప్రవేశానికి ప్రవేశాలు ప్రారంభమయ్యాయని హుస్నాబాద్ తేజస్విని ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ పవన్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన నిరుద్యోగ యువకులు జూన్ 10వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## 29 నుంచి ఉచిత మగ్గం వర్క్ శిక్షణ తరగతులు



మగ్గం వర్క్ నేర్చుకుంటున్న మహిళలు

**రంగారెడ్డిజిల్లా మే 23, (ప్రభాతవార్త) :**
యూనియన్ బ్యాంక్, జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్, స్వర్ణ భారత్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో గ్రామీణ మహిళలకు ఈనెల 29 నుంచి మగ్గం వర్క్‌లో శిక్షణ తరగతులు ప్రారంభం కాబోతున్నాయని నిర్వహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ తరగతులు 30రోజుల పాటు రంగారెడ్డి జిల్లా ముచింతల్ స్వర్ణభారత్‌ట్రస్ట్ ఆవరణలో కొనసాగుతాయని,19 నుంచి 45 సంవత్సరాల వయస్సు ఉన్న వారు తమ రేషన్ కార్డు, ఆధార్‌కార్డు,పాస్‌పోర్టు సైజ్ ఫోటోలతో తమను సంప్రదించాలని వారు తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత భోజన సౌకర్యం, వసతి,యూనిఫారం,టూల్ కిట్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు.

## సమిష్టి సహకారంతో బాల్య వివాహాల నిర్మూలన సాధ్యం : ఎంపిపి మల్లేశం



సమావేశంలో మట్లాడుతున్న ఎంపిపి మల్లేశం,పూడూరు సర్పంచ్ నవ్యా నర్సింహ్మారెడ్డి,ఎంఇఓ హరిశ్చంద్ర తదితరులు

**పూడూరు, మే 23, ప్రభాతవార్త :**
ప్రజా ప్రతినిధులు,అధికారులు సమిష్ఠిగా కృషిచేస్తే బాల్య వివాహాల నిర్మూలన సాధ్యమౌతుందని ఎంపిపి పూడుగుర్తి మల్లేశం పేర్కొన్నారు. మంగళవారం పూడూరు మండల కేంద్రంలోని రైతువేదికలో ప్రజా ప్రతినిధులు,అధికారులు,అంగన్‌వాడీ కార్యకర్తలకు బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యం బాలలహక్కు వారిని పాఠశాలల్లో విద్యను అభ్యసించే విధంగా ప్రోత్సహించాలని వివరించారు. బాల్య వివాహాలు చేసిన వారిపై చట్టరిత్యా కఠిన చర్యలు హెచ్చరించారు. బాల్య వివాహాలు చేసినా,ప్రోత్సహించినా వెంటనే సమాచారం అందించాలని కోరారు. అందరి సహకారంతో బాల్య వివాహాల నిర్యూలన సాధ్యమౌతుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి మేఘమాల, సర్పంచులు నవ్యానర్సింహ్మారెడ్డి, శ్రీధర్‌గుప్తా, ఆంజనేయులు, పాపయ్య,ఎంపిటిసి సల్మాబేగం,సిడిపిఓ వెంకటేశ్వరమ్మ,ఎంఇఓ హరిశ్చంద్ర,ఎంపిఓ,ఎపిఓ,అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నర్సమ్మ, చైల్డ్‌లైన్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్,అంగన్‌వాడీ కార్యకర్తలు వనజ, అండాలు,పుష్ప,అంజమ్మ, పంచాయతీ కార్యదర్శులు,పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కార్యకర్తకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాం

- బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొప్పుల అనిల్‌రెడ్డి భరోసా



కండువా కప్పి కాంగ్రెస్ పార్టీ నాయకులను బిఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆపార్టీ రాష్ట్ర నాయకుడు కే అనీల్‌రెడ్డి,ఎంపిపి మల్లేశం,అజీం తదితరులు

**పూడూరు, మే 23, ప్రభాతవార్త :**
పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు తమ కుటుంబం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని బిఆర్ఎస్‌పార్టీ రాష్ట్ర నాయకుడు కొప్పుల అనీల్‌రెడ్డి భరోసా ఇచ్చారు. మంగళవారం పూడూరు మండలం పరిధిలోని చెన్‌గోముల్ గ్రామ శివారులో ఉన్న అజీం వ్యవసాయ క్షేత్రంలో చింతలపల్లి గ్రామానికి చెందిన బేగరి వెంకటయ్య,కూని నర్సింలు,కూని జంగయ్య,కుర్వ మల్లేష్,పిబి మల్లేష్‌లతో పాటు సుమారు 60 మంది కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు అనీల్‌రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, ఎంపిపి మల్లేశం,జిల్లా పార్టీ సీనియర్ నాయకులు అజీంలతో కలిసి పార్టీలో చేరిన నాయకులకు బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం కొప్పుల అనీల్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సిఎం కెసిఆర్ చేస్తున్న అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీనుండి భారీ ఎత్తున తమ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని వివరించారు. వచ్చేది మళ్లీ బిఆర్ఎస్ ప్రభుత్వమేనని,అందుకు అందరు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పరిగి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎండి అజారుద్దీన్,మండల పార్టీ నాయకులు వినయ్‌రెడ్డి, అమీర్‌అలీ, రయీస్‌ఖాన్, చింతల్‌పల్లి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జంగయ్య, నాయకులు మురళి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తకుప్పలను తొలగించాలి

### -డిఎల్‌పిఓ శంకర్ నాయక్

**పెద్దేముల్, మే 23, ప్రబాతవార్త:**
రొడ్డుకు ఇరువైపుల ఉన్న చెత్తకుప్పలను తొలగించాలని డిఎల్‌పిఓ శంకర్‌నాయక్ ఆదేశించారు. పారిశుద్ధంలో బాగంగా మంగళవారం పెద్దేముల్ మండలంలోని మంబాపూర్.నాగులపల్లి, తట్టెపల్లి, జైరాంతాండా,ఓంలనాయక్‌తాండా తదితర గ్రామాలలో డిఎల్‌పిఓ సందర్శించారు. ఈ సందర్భంగా డిఎల్‌పిఓ శంకర్‌నాయక్ మాట్లాడుతూ గ్రామంలో ఎక్కడ కూడా చెత్తచెదారం కనిపించకుండా చూడాలని అన్నారు. మురుగుకాలువలను ఎప్పటికపుడు శుభ్రంగా ఉంచాలని అన్నారు. గ్రామాల నడిమధ్యన ఉన్న పెంటగుంతలను వెంటనే పూడ్చివేసేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యంపిఓ సుష్మ, సర్పంచ్ శ్రావన్, పంచాయతీ కార్యదర్శి సంజీవ్ ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎల్‌పిఓ శంకర్ నాయక్

# రాష్ట్ర అవతరణ వేడుకల్లో కెసిఆర్ న్యూట్రిషన్ కిట్ ప్రారంభించాలి

### -వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు

**వికారాబాద్, మే 23, ప్రభాతవార్త:**
రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల సందర్భంగా కెసిఆర్ న్యూట్రిషన్ కిట్ పథకం ప్రారంభం చేయాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హారీష్‌రావు అన్ని జిల్లాల కలెక్టర్లకు సూచించారు. మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు రాష్ట్ర స్థాయి వైద్య శాఖ ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్‌లు, వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో జిల్లాలలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ఈ వీడియో సమావేశంలో పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు మాట్లాడుతూ, గర్భిణీ మహిళలకు అనీమియా సమస్య పరిష్కరించేందుకు ప్రభుత్వం కెసిఆర్ న్యూట్రిషన్ కిట్ పథకం అమలు చేస్తుందని, మొదటి దశలో రాష్ట్ర వ్యాప్తంగా 9 జిల్లాలలో ఈ కార్యక్రమాన్ని అమలు చేసామని, ప్రస్తుతం మిగిలిన 24 జిల్లాలకు విస్తరిస్తున్నామని మంత్రి అన్నారు. పుట్టబోయే బిడ్డల ఆరోగ్యం, తల్లి సంరక్షణ కోసం కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ ఉపయోగపడుతుందని, ప్రతి గర్భిణీకి 2 సార్లు కెసిఆర్ న్యూట్రిషన్ కిట్ అందిస్తామని తెలిపారు. ప్రతి సంవత్సరం రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 6.84 లక్షల మంది గర్భిణీలు ఉంటారని, 2వ ఏఎన్‌సి రిజిస్ట్రేషన్, 3వ ఏఎన్‌సి రిజిస్ట్రేషన్ సమయంలో 2 సార్లు గర్భిణీలకు న్యూట్రిషన్ కిట్ ఇస్తామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 111 కేంద్రాల ం గుర్తించామని, అక్కడ న్యూట్రిషన్ కిట్ల పంపిణీకి అవసరమైన ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నూతనంగా 2038 ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సబ్ సెంటర్‌లను మంజూరు చేశామని, 422 సబ్ సెంటర్ నిర్మాణ పనులు పూర్తి చేశామని, మరో 177 పనులు చివరి దశలో ఉన్నాయని, 610 నిర్మాణ పనులు వివిధ దశలో ఉన్నాయని అధికారులు వివరించారు. రాష్ట్రంలో 63 సబ్ సెంటర్ భవనాలకు భూకేటాయింపులు జరగలేదని, వీటిపై కలెక్టర్‌లు శ్రద్ధ వహించి గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉండే భూములను ఎంపిక చేసి సబ్ సెంటర్ల కేటాయించాలని మంత్రి సూచించారు. సబ్ సెంటర్‌లలో నిర్మాణం కోసం ముందస్తుగా జిల్లా ప్రజా పరిషత్తులకు, పట్టణ ప్రాం తాల్లో మున్సిపాలిటీలకు నిధులను విడుదల చేశామని, వారం రోజులలో మరో 400 కోట్ల నిధులు విడుదల చేస్తామని మంత్రి పేర్కొన్నారు. సబ్ సెంటర్ భవన నిర్మాణానికి నిధుల సమస్య లేనందున త్వరితగతిన 766 సబ్ సెంటర్ల టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించాలని అన్నారు. జిల్లాలకు నూతనంగా మం జూరు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాలు, బస్తీ, పల్లె దవాఖానాలు, డయాగ్నోస్టిక్ హబ్ పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా 3208 పల్లె దవాఖానాలు ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంతంలో ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం నిర్ణ యించిందని, వీటిలో ఇప్పటికే 2995 మైల్డ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లను నియమిం చామని, ప్రస్తుతం ఖాళీగా ఉన్న 211 పోస్టుల ం జిల్లా స్థాయిలో భర్తీ చేయాలని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో 1.5 కోట్ల మందికి కంటి పరీక్షలు నిర్వహించి 21.4 లక్షల మందికి రీడింగ్ గ్లాసెస్, 17.08 లక్షల మందికి ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్ పంపిణీ చేశామని మంత్రి తెలిపారు. సిపిఆర్ శిక్షణ పై వైద్యాధికారులు శ్రద్ధ వహించాలని, నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు సిపిఆర్‌పై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మరో 15 రోజుల పాటు తీవ్రమైన ఎండలు ఉంటాయ ని, ఎండల కారణంగా వడదెబ్బ బారిన ప్రజలు పడకుండా అవసరమైన సూచ నలు సలహాలు తెలియజేయాలని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పాల్వాన్ కుమార్, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మంత్రి వీడియో కాన్ఫరెన్సును వీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

# రా రైస్ మిల్లర్‌లకు గుది బండగా మారిన వరి ధాన్యం సేకరణ

### -ధాన్యం సేకరణకు నిరాకరిస్తే మిల్లులను సీజ్ చేస్తామంటున్న అధికారులు?
### -నూకలతో భారీగా నష్టాలొస్తాయంటున్న మిల్లర్‌ల యజమానులు

**యాలాల మే 23,ప్రభాతవార్త :**
రబీ సీజన్లో వరి ధాన్యం సేకరణ రా రైస్ మిల్లర్స్‌లకు గుది బండలా మారింది. ప్రభుత్వం మద్దతు ధరతో రైతుల నుంచి కొనుగోలు చేస్తున్న వరి ధాన్యాన్ని మిల్లర్‌లకు అప్పగించే ప్రక్రియను వేగవంతం చేసింది. అయితే ఈ సీజన్‌లో ధాన్యాన్ని సేకరించేందుకు మిల్లర్‌లు వెనుకంజ వేస్తున్నారు. రబీ సీజన్ వరి ధాన్యాన్ని మిల్లింగ్ చేస్తే నూకల శాతం భారిగా వస్తాయని మిల్లర్‌లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నూకల పర్సెంటేజీ తమను నిండుగా ముంచే ప్రమాదం ఉందని మిల్లర్లు భయపడుతున్నారు. లాభం రాకున్నా పర్వాలేదు కనీసం నష్టం రాకుండా అధికారులు చర్యలు చేపడితే ధాన్యం సేకరణకు అభ్యంతరం లేదని మిల్లర్‌లు పేర్కొంటున్నారు. నష్టాలతో తమ ఆస్తులను అమ్ముకోవాల్సిన దుస్థితి వచ్చే ప్రమాదం ఉందని భయపడడం గమనార్హం. అధికారులు నూకల శాతంపై స్పష్టమైన లిఖిత పూర్వక హామీ ఇస్తేనే ధాన్యం సేకరణకు ముందుకు వస్తామని మిల్లర్లు భీష్మించుకున్నట్లు తెలిసింది. మరో పక్క అధికారులు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. ధాన్యం సేకరణకు నిరాకరించే మిల్లర్‌లు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తోందని హెచ్చరికలు జారీ చేశారు. ధాన్యం నిరాకరించే రా రైస్ మిల్లులను సీజ్ చేయాల్సి వస్తోందని అధికారులు హెచ్చరిస్తున్నట్లు సమాచారం. ధాన్యం సేకరణ కోసం జిల్లా అధికార యంత్రాంగం ఇప్పటికే జిల్లాలోని వివిధ మండలాలతో పాటు యాలాల మండలంలోని ఆరు రా రైస్ మిల్లులకు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. రబీ సీజన్‌లో పండే వరి ధాన్యాన్ని రా రైస్ మిల్‌లో మిల్లింగ్ చేస్తే భారిగా నూకలు వచ్చే ఆస్కారం ఉంది. క్వింటాలు వరి ధాన్యాన్ని మిల్లింగ్ చేస్తే సుమారు 30 నుంచి 40 శాతం వరకు నూకలు వచ్చే అవకాశం ఉంది. ఈ సీజన్ ధాన్యాన్ని బలవంతంగా రా రైస్ మిల్‌లకు అప్పగిస్తే భారిగా నష్టాలు వస్తాయనే వాదన వినిపిస్తోంది. కాగా కష్టమ్ మిల్లింగ్ నిబంధనల ప్రకారం క్వింటాలు ధాన్యానికి గాను 67 కిలోల బియ్యాన్ని మిల్లర్‌లు అప్పగించాల్సి ఉంది. ఈ క్రమంలో రా రైస్ మిల్లుల్లో ఈ ప్రక్రియ సాధ్యం కాదనే వాదన వినిపిస్తోంది. తెలంగాణలో రెండు సీజన్‌లలో వాతావరణ పరిస్థితుల వల్ల ధాన్యాన్ని వేర్వేరు పద్ధతుల్లో మిల్లింగ్ చేయాల్సిన అవసరం ఉందనే విషయం తెలిసిందే. అయినప్పటికీ బాయాల్డ్ రైస్ మిల్లులకు అప్పగించాల్సి ధాన్యాన్ని రా రైస్ మిల్లులకు అప్పగించడం ఏమిటనే ప్రశ్న తలెత్తుతోంది. రైతుల కోసం తాము ధాన్యం సేకరణకు ముందుకొస్తామని,కానీ నూకల విషయంలో సంబంధిత అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వాలని మిల్లర్లు విజ్ఞప్తి చేస్తున్నారు. అంతే కాకుండా క్వింటాలుకు గాను రూ.15 ఇచ్చే వర్కింగ్ చార్జీలు వెంటనే విడుదల చేయాలని పలు రైస్ మిల్లర్లు కోరుతున్నారు. గత మూడేళ్లుగా ప్రభుత్వం నుంచి ఈ డబ్బులు విడుదల కాలేదని,తమకు అందలేవని మిల్లర్లు పేర్కొంటున్నారు. రా రైస్ మిల్‌లో నేరుగా ధాన్యాన్ని మిల్లింగ్ చేస్తే ముడి బియ్యం,లేదా రా రైస్ వస్తాయి. అదే ధాన్యాన్ని నిర్ణీత ఉష్ణోగ్రతల వద్ద ఉడికించి మరపట్టిస్తే బయాల్డ్ రైస్‌గా మారుతాయి. ఇదిలా ఉండగా రైస్ మిల్లులనుంచి బియ్యాన్ని గోదాంలకు అప్పగించడం మిల్లర్‌లకు తలకు మించిన భారంగా మారింది. గోదాంల వద్దకు పంపిన బియ్యాన్ని కూలీలు(లేబర్) అందుబాటులో లేకపోవడంతో సకాలంలో దించడంలేదు. దీంతో ఒక్కోసారి లోడ్‌తో ఉన్న లారీలు మూడు నాలుగు రోజులు గోదాం ముందు పడిగాపులు కాయాల్సిన పరిస్థితులున్నాయి. దీంతో మిల్లర్లకు అదనంగా లారీ కిరాయిల భారాన్ని భరిస్తున్నాట్లు తెలిసింది. అంతేకాకుండా మిల్లింగ్ చేసిన బియ్యంలో ఏ మాత్రం నాసిరకంగా ఉన్నా సదరు అధికారులు లారీ లోడ్‌ను రిజెక్ట్ చేయడంతో మళ్లీ మిల్లింగ్ చేసి గోదాంకు పంపించడం వల్ల ఒక్కో లారీకీ అదనపు భారం పడుతున్నట్లు మిల్లర్లు వాపోతున్నారు. రా రైస్ మిల్లుల వద్ద ధాన్యాన్ని నిల్వ చేసేందుకు సరైన సౌకర్యాలు లేవు. వర్షా కాలం ముంచుకొచ్చే వేల ధాన్యం నిల్వలకు గోదాంల సౌకర్యం లేదు. ధాన్యం తడవకుండా నిల్వలపై ప్లాస్టిక్ కవర్స్ లేదా తాడిపత్రిలు సమకూర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ధాన్యం సేకరణ నూకలతో ముడిపడి ఉండడంపై అధికార యంత్రాంగం ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఈ విషయంలో అధికారులు మిల్లర్లతో చర్చించి సమస్య పరిష్కారానికి మార్గం సుగమం చేస్తే వారం రోజుల్లో ధాన్యం సేకరణ పూర్తవుతోంది. రానున్న వర్షాకాలన్ని పరిగణలోకి తీసుకొని అధికార యంత్రాంగం జోక్యం చేసుకొని సమస్యకు పరిష్కార మార్గం చూపితే రైతులతో పాటు మిల్లర్లుకు సమస్య తీరుతోందని పలు గ్రామాల రైతులు పేర్కొంటున్నారు.

# తండ్రేమో నీళ్లు దోచుకెళ్తే కూతురు మొసలి కన్నీరా?

- వైఎస్ షర్మిల వ్యాఖ్యాలపై షాద్‌నగర్ బీఆర్ఎస్ నేతలు ఫైర్
- పాలమూరు రంగారెడ్డికి జాతీయ హోదా బీజేపీ బాధ్యత కాదా...?
- పదిసార్లు కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అధికారం కట్టబెడితే ఏం చేశారు..?
- ప్రతిపక్షాల విమర్శలపై బీఆర్ఎస్ నేతల ఆగ్రహం


**షాద్‌నగర్, మే 23, (ప్రభాతవార్త) :**
తండ్రేమో నీళ్లను దోచుకెళ్తే... కూతురు పాలమూరు రంగారెడిడ ఎత్తిపోతల పథకం గురించి మొసలి కన్నీరు కారనచడం వైఎస్ షర్మిల వంతైందని, అదేవిధంగా అధికారంలో ఉన్న బీజేపీ తన పరపతిని మరిచి మాట్లాడుతున్నారని, మరోవైపు కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పది సార్లు పట్టం కడితే ప్రజల కోసం ఏం చేశారో చెప్పాలంటూ కాంగ్రెస్, బీజేపీ, వైఎస్సార్‌టీపీ తెలంగాణ పార్టీల విమర్శలపై బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎదురు దాడికి దిగారు. షాద్‌నగర్‌లో జరిగిన మహాధర్నా సందర్భంగా వైఎస్ షర్మిల చేసిన వ్యాఖ్యాలపై బీఆర్ఎస్ పార్టీ నాయకులు మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా జడ్పీ వైస్ ఛైర్మన్ ఈట గణేష్, షాద్‌నగర్ మున్సిపల్ ఛైర్మన్ నరేందర్, సింగిల్ విండో ఛైర్మన్ దామోదర్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి, మన్నె నారాయణ, ఎమ్మె సత్యం, రామకృష్ణ, శ్రీశైలంగౌడ్ తదితరులు మీడియా సమావేశంలో మాట్లాడారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పోతిరెడ్డి పాడు వద్ద రెగ్యూలేటర్ ద్వారా నాలుగు తూములకు 10 తూములు నిర్మించి ఆంధ్రకు నీళ్ల తరలించుకుపోయిన సంఘటనను గుర్తు చేశారు. విద్యుత్ ఉత్పతినత కోసం మరో తూము నిర్మించి జిల్లాకు మొట్టమొదట అన్యాయం చేసింది మీ తండ్రి వైఎస్ కాదా అని వారు ప్రశ్నించారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకాన్ని వైఎస్ రాజశేఖరెడ్డి హయంలో ప్రారంభించారని చెబుతున్న వైఎస్ షర్మిల అంతకన్నా ముందు తెలుగుదేశం పార్టీ హయాంలో మొదటి పంప్ హౌస్‌కు మూడు రిజర్వాయర్లను నిర్మించిన సంగతి మరువద్దని సూచించారు. అదేవిధంగా పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో ఎంత జరిగిందో బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక ఎంత జరిగిందో...? చూడటానికి గత సమావేశంలో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ బస్సులు పెడతామంటూ చెప్పిన ప్రస్తావన వారు గుర్తు చేశారు. 60 సంవత్సరాల పాటు సుదీర్ఘంగా ప్రజలను పాలించిన కాంగ్రెస్ పార్టీ లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు గురించి ఎందుకు కనుక్కోలేకపోయిందని వారు ప్రశ్నించారు. లక్ష్మీదేవిపల్లి ఒక ఎత్తైన ప్రదేశం అని మొట్టమొదట గుర్తించింది ముఖ్యమంత్రి కేసీఆర్ అని వారు అన్నారు. ఇక్కడ రిజర్వాయర్ కట్టాలంటే కృష్ణ నది నుంచి నీళ్ల ఎత్తిపోయాలని పేర్కొన్నారు. అందుకోసం పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా దీనికి జలాలు అందించాలన్న నిశ్చయంతో ప్రభుత్వం ఈ రిజర్వాయర్లు ఏర్పాటు చేయబోతుందంటూ వ్యాఖ్యానించారు. ఇందులో భాగంగానే నార్లాపూర్, కరివేనా, ఏదుల, వట్టెం వద్ద రిజర్వాయర్ పనులు పూర్తయ్యాయని, ఉదండపూర్ వద్ద 80 శాతం పనులు వేగవంతంగా సాగుతున్నాయని అన్నారు. ఒక కాంగ్రెస్ నాయకుడు రెండు సార్లు అధికారం ఇస్తే ఏం చేశారని ప్రశ్నిస్తున్నారని 10 సార్లు కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే మీరేం చేశారో చెప్పాలని వారు ప్రతి సవాల్ విసిరారు. రాష్ట్ర నూతన సచివాలయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన ఇరిగేషన్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారని వివరించారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం వీలైనంత త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సీఎం సూచించినట్లు వారు పేర్కొన్నారు. ఉదండాపూర్ తరువాత లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మించి ఒకవేళ కృష్ణానదిలో జల కొరత ఏర్పాడితే గోదావరి జలాలు కూడదా వాడుకునేందుకు ప్రత్యామ్నాయంగా పథకాన్ని రూపొందించారని వారు వివరించారు. కాలువల నిర్మాణాలకు సహితం ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందని, టెండర్ల కోసం ఇచ్చిన ఉత్తర్వుల వివరాలకు మీడియాకు వివరించారు. బీజేపీ ప్రభుత్వం కృష్ణానది జలాల్లో వాటా ఎందుకు తెల్చడం లేదని వారు ప్రశ్నించారు. ఈ సమస్యను ఇంకా జటిలం చేస్తున్నది కేంద్ర ప్రభుత్వమేనని, నీటి వాట పంపిణీకి కేంద్రం ఇంత ఆలోచన చేయడం భావ్యమేనా అని అన్నారు. బీజేపపీ అధికారంలోకి వస్తే లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు పూర్తి చేస్తామంటున్న బీజేపీ నాయకులు ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న విషయాన్ని మర్చిపోయారా..? అని బీఆర్ఎస్ నాయకులు ఎద్దేవా చేశారు. ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాల్సిన బాధ్యత బీజేపీ పై లేదా అని వారు ప్రశ్నించారు. ఈ విలేరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

## చల్లా నర్సింహ్మారెడ్డికి నాయకులు సన్మానం

**మొయినాబాద్, మే 23. ప్రభాతవార్త :**
రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నర్సింహ్మారెడ్డికి రెండవసారి జిల్లా అధ్యక్ష పదవికి ఎన్నికైన సందర్భంగా చేవెళ్ల నియోజకవర్గం పీసీసీ సభ్యులు రాచమల్ల సిద్దేశ్వర్ ఆధ్వర్యంలో మొయినాబాద్ మండల నాయకులు కలిసి శాలువా పూలమాలలతో సత్కరించి సన్మానించారు. ఈకార్యక్రమంలో టీపీసీసీ మైనార్టీ ప్రధాన కార్యదర్శి ఖాజాపాష, టీపీసీసీ ఎస్సీ సెల్ సహాయ కార్యదర్శి నవీన్‌కుమార్, జిల్లా నాయకులు రాఘవరెడ్డి, మొయినాబాద్ మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు నర్సింగ్‌రావు, టీపీసీసీ సోషల్ మీడియా చేవెళ్ల నియోజకవర్గం బురాన్ సురేష్, అజీజ్‌నగర్ గ్రామ అధ్యక్షులు చెంగలి వెంకట్‌రెడ్డి, మండల నాయకులు బండారి చంద్రారెడ్డి, రవీందర్‌రెడ్డి, ఫెరోజ్, యూసుఫ్‌ఖాన్, మండల యువజన ఉపాధ్యక్షులు మోత్కుపల్లి భాస్కర్, మండల యువజన సీనియర్ నాయకులు పులగళ్ల కుమార్, నాగిరెడ్డిగూడ కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎర్ర విజయ్ రాజు, బాకారం కాంగ్రెస్ యువనాయకులు కొండికల్ల చంద్రశేఖర్, అమీర్‌గూడ కాంగ్రెస్ యువజన నాయకులు తదితరులు ఉన్నారు.



చల్లా నర్సింహ్మారెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

## మంబాపూర్‌లో ప్రమాదవశాత్తు పాడి ఆవు మృతి



మృతిచెందిన పాడి ఆవు

**పెద్దేముల్, మే 23, ప్రభాతవార్త:**
ప్రమాదవాశాత్తు పాడి ఆవు మృతి చెందిన సంఘటన పెద్దేముల్ మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. మండలంలోని మంబాపూర్ గ్రామానికి చెందిన గిద్ద శ్రీనివాస్ కుటుంబ పోషణకై పాడి ఆవును పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఎప్పటి మాదిరిగా ఆవును మేపడానికి ఇతరుల పోలము వద్ద విడిచి వెళ్ళాడు. ఆవును విడిచి వెళ్లడంతో ఆవు మెడకు తాడు బిగుతై మృతిచెందింది. తాడు బిగుతై మృతి చెందిందా లేదా ఎవరైన ఆవు మెడకు తాడు బిగించి చంపడం జరిగిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కుటుంబ పోషణకై పెంచుకుంటున్న పాడి ఆవు మృతి చెందడంతో తమకు కుటుంబ పోషణ భారమవుతుందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితుడు గిద్ద శ్రీనివాస్ కోరుతున్నాడు.

## 4వ వార్డులో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం



మేడ్చల్ మున్సిపల్ 4వ వార్డులో చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం

**మేడ్చల్, మే 23. ప్రభాతవార్త ః**
మేడ్చల్ మున్సిపాలిటిలోని 4వ వార్డులో మంగళవారం కౌన్సిలర్ గణేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు పరిధిలో చెత్తను శుభ్రం చేయించి, మట్టి దిబ్బలను, ముళ్ల చెట్లను తొలగించామని కౌన్సిలర్ తెలిపారు. అదే విదంగా చెత్తను ఆరు బయట పారవేయకుండా, మున్సిపల్ చెత్త వాహానాలకు అందించాలని ప్రజలకు వివరించినట్లు ఆయన పేర్కొన్నాడు. దోమల నివారణకు చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్ రావు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

## గుండ్లపోచంపల్లి మున్సిపల్ సాధారణ సమావేశం



గుండ్లపోచంపల్లి మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సాధారణ సమావేశం

**మేడ్చల్, మే 23. ప్రభాతవార్త ః**
గుండ్లపోచంపల్లి మున్సిపాలిటి సాధారణ సమావేశాన్ని మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో చిల్డ్రన్స్ పార్క్ ఏర్పాటు, మ్యాన్ హోల్ రిపేర్లు, బోర్ మోటార్ల నిర్వహణ, రిపేర్లు తదితర వాటితో పాఉ పలు అభివృద్ధి పనులపై చర్చించారు. అనంతరం మున్సిపల్ నిధులతో కొనుగోలు చేసిన క్రేన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాములు, వైస్ చైర్మన్ ప్రభాకర్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## డబిల్‌పూర్‌కు బయోడైవర్సిటీ అవార్డు

### -అవార్డు అందుకోవడం సంతోషం : సర్పంచ్ గీతా భాగ్యరెడ్డి



బయో డైవర్సి అవార్డును అందుకున్న డబిల్‌పూర్ గ్రామ సర్పంచ్ గీతా భాగ్యరెడ్డి

**మేడ్చల్, మే 23. ప్రభాతవార్త ః** పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం పెంపొందించినందుకు గాను డబిల్‌పూర్ గ్రామానికి మేడ్చల్ జిల్లాలోనే ఉత్తమ బయోడైవర్సిటీ అవార్డు దక్కింది. ఈ అవార్డును తెలంగాణ రాష్ట్ర బయో డైవర్సిటీ బోర్డు ప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వ అధికారుల చేతుల మీదుగా గ్రామ సర్పంచ్ గీతా భాగ్యరెడ్డి, ఉప సర్పంచ్ సత్యనారాయణ, వార్డు సభ్యుడు రామోదర్‌రెడ్డిలు అందుకున్నారు. అవార్డు అందుకున్న సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ దేశంలోనె ఎక్కడా లేని విదంగా రాష్ట్రం ఏర్పడిన అనంతరం సీఎం కేసీఆర్ సారధ్యంలో తెలంగాణలో పచ్చదనం పెంపొందిందని అందరికి ఆదర్శంగా మారిందని అన్నారు. పల్లె ప్రగతి, ప్రకృతి వనాలతో ఏ పల్లె చూసినా పచ్చదనంతో ఉట్టి పడుతున్నాయని అన్నారు. తమ గ్రామంలో కూడ పాలక వర్గ సభ్యులు, పంచాయతీ సిబ్బంది కృషితోనె పచ్చదనం, పర్యావరణ పరిరక్షణ చేసుకోగలిగామని, దీంతో మాకు ఈ అవార్డు దక్కిందని సంతోషం వ్యక్తం చేశారు. అందుకు కృషి ప్రతి ఒక్కరికి దన్యవాదాలు తెలియజేశారు.

## బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన

**బషీరాబాద్,మే 23,ప్రభాతవార్త:**
మహిళ శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నాడు బషీరాబాద్ మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు మాట్లాడుతూ బాల్యవివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. చట్టం ప్రకారం బాలికలు 18 సంవత్సరాల నుండి 21 సంవత్సరాలు వయస్సు నిండి ఉండాలన్నారు. బాలురకు 21 సంవత్సరాలు నిండిన తర్వాతే పెళ్లి చేసేల గ్రామాలల్లో అవగాహన కల్పించాలని సమావేశంలో పంచాయతీ కార్యదర్శులకు,అంగన్వాడి టీచర్‌లకు కోరారు. బాల్యవివాహాల నిర్మూలనకు గ్రామాలల్లో మరింత అవగాహన కల్పించాలని తెలిపారు. విద్యార్థుల చదువులు అర్థాంతరంగా ఆగిపోకూడదని విద్యార్థులు చదువుకునేందుకు అధికారుల ప్రోత్సాహం ఉంటుందన్నారు. మరింత వివరాలకోసం జిల్లా బాలల పరిరక్షణ విభాగంలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో బషీరాబాద్ తహశీల్దార్ వెంకటస్వామి,ఎస్ఐ విద్యాచరణ్ రెడ్డి,ఐసిడిఎస్ అధికారిణి జయశ్రీ,వికారాబాద్ జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి నరేష్ కుమార్,ఇంచార్జి సిడిపివో నిర్మల,ఎంఈవో సుధాకర్ రెడ్డి,చైల్డ్‌లైన్ ప్రతినిధి నర్సిములు, సూపరిండెంట్ విజయలక్ష్మీ తదితరులు ఉన్నారు.





పాఠశాల ముందు మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

## పాఠశాలను నడుపుతున్నవారిపై చర్యలు తీసుకోవాలి

**చేర్యాల,మే 23, ప్రభాతవార్త :** మహర్షి పేరుతో శ్రీచైతన్య పాఠశాలను నడుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ చేర్యాల డివిజన్ కమిటి ఆధ్వర్యంలో స్కూల్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ చేర్యాల డివిజన్ అధ్యక్షుడు ఆముదాల రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ రెండు నెలలుగా చేర్యాలలో సంబంధిత పాఠశాల యాజమాన్యం అడ్మిషన్ కొరకు ప్రచారం చేస్తున్నారని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్ళిన పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైన అధికారులు పట్టించుకోకపోతే విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తు ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు. డివిజన్ నాయకులు పోరా రాజశేఖర్ రెడ్డి నితిన్, రాకేష్, హరి తదితరులు పాల్గొన్నారు.

## పది టాపర్స్‌ను సన్మానించిన రిలయన్స్ ట్రెండ్స్ సంస్థ


విద్యార్థులను సన్మానిస్తున్న రిలయన్స్ ట్రెండ్స్ సంస్థ మేనేజర్

**చేర్యాల,మే 23, ప్రభాతవార్త :** చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లి, పెద్దరాజుపేట గ్రామాల ఉన్నత పాఠశాలల టాపర్స్ విద్యార్థులు ఐశ్వర్య, కీర్తన, అక్షితలను మంగళవారం మండల కేంద్రంలోని రిలయన్స ట్రెండ్స్ సంస్థలో సేల్స్ మేనేజర్ దండు దయాకర్ వారిని సన్మానించి ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కిష్టయ్య, ఉపాధ్యాయులు ధర్మారెడ్డి, బాల భాస్కర్, నూజాహత్ జహాన్, విజయ్ కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు

**చేర్యాల,మే 23, ప్రభాతవార్త:** చేర్యాల మండల కేంద్రంలో ఉన్న ఎరువుల దుకాణాలపై వ్యవసాయ శాఖ కమిషనరేట్ ఏడిఏ కే పద్మజ , సంబంధిత అధికారులతో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడిఏ పద్మజ మాట్లాడుతూ విత్తన డీలర్లు రైతులకు నకిలీ విత్తనాలు అమ్మిన, బీటి త్రీ పత్తి విత్తనాలు నాసిరకం పురుగులమందులు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అవసరమైతే పీడియాక్ట్ కింద కేసులు నమోదు చేసి సంబంధిత డీలర్ లైసెన్స్‌ను రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో టాస్క్‌ఫోర్స్ ఎస్సై సిహెచ్ రమేష్ ,హెడ్ కానిస్టేబుల్ రామ్మోహన్, పృద్వీరాజ్, మండల వ్యవసాయ శాఖఅధికారి ఆఫ్రోజ్,కమిషనరేట్ అధికారులు పాల్గొన్నారు.

## వివోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలి : రవికుమార్


ఆందోళన చేస్తున్న వివోఏలు

**సిద్దిపేట రూరల్, మే 23, ప్రభాతవార్త:** వివోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ డిమాండ్ చేశారు. సిద్దిపేట అర్బ న్, రూరల్ మండల సమాఖ్య కార్యాలయాల ఎదుట మంగళవారం ఆందోళన నిర్వహించి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా అయన పాల్గొని మాట్లాడారు. వివో ఎలకు బీమా సౌకర్యం కల్పించడంతో పాటు ఎపిఎం, సీసీల వేధింపులను అరికట్టాలన్నారు. వివోఎలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు.మహిళలకు ఇచ్చిన రుణాలు మాఫీ చేయాలన్నారు. వివోఎల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు మరింత ఉదృతం చేస్తామన్నారు. ఐకెపి వివోఎల యూనియన్ నాయకులు రాజు, చంద్రకళ, రవి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువకులకు ఉపాధి కోసం ఉచిత శిక్షణ : సీపీ

**సిద్దిపేట రూరల్, మే 23, ప్రభాతవార్త:** నిరుద్యోగ యువకులకు ఉపాధి కోసం పోలీసుశాఖ అధ్వర్యంలో నాబార్డు, యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో 45 రోజుల పాటు నిపుణులైన ఫ్యాకల్టీతో సీసీ కెమెరాల రిపేరు, మెం టనెన్స్, సర్వీస్, ఏసీ/రిఫ్రిజిరేటర్ రిపేర్ సర్వీస్‌లలో ఉచిత శిక్షణ ఇవ్వ డం జరుగుతుందని సీపీ శ్వేత తెలిపారు. మంగళవారం అమె మా ట్లాడుతూ శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి సదుపాయం కల్పించడం జరుగుతుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత అర్హులైన అసక్తిగల వారికి వివిధ బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిం చడం జరుగుతుందన్నారు. 18 యేండ్లు నిండి పదో తరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన వారు శిక్షణ పొందవచ్చునని తెలిపారు. యువ కులు ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అసక్తిగల అభ్యర్థులు పోలీసు కమిషనరేట్ కార్యాలయం స్పెషల్‌బ్రాంచ్(ఎస్బీ) కార్యాలయంలో ఈనెల 24 నుంచి 31 వరకు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 8712667380 నంబరు సం ప్రదించాల న్నారు.

## సిఎం చిత్రపటానికి పాలాభిషేకం


సిఎం కెసిఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న జెపిఎస్‌లు

**బెజ్జంకి, మే 23, ప్రభాతవార్త :** జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరణ చేస్తామని సిఎం కెసిఆర్ ప్రకటించడంతో మంగళవారం ఎంపిడిఓ కార్యాలయం అవరణలో జెపిఎస్‌ల అధ్వర్యంలో సిఎం కెసిఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపిపి లింగాల నిర్మల, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు చింతపల్లి సంజీవరెడ్డి, నాయకులు దారం తిరుపతిరెడ్డి, అయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## వివోఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

**జగదేవ్‌పూర్, మే 23 (ప్రభాతవార్త):** గ్రామాల్లో పనిచేస్తున్న వివోఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు మరాటి కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని ఐకెపి కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న వివోఏల సమ్మెలో పాల్గొని వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివోఏల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి వారిని సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు.ఈ కార్యక్రమంలో వివోఏల సంఘం మండల అధ్యక్షుడు నర్ర కనకయ్య, శ్రీనివాస్‌రెడ్డి, బిక్షపతిరెడ్డి, సరళ, వినోద, పబ్బోజు సుదర్శన్, జాహెద తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న దృశ్యం

## రైతు బంధు పేరిట ఇన్‌పుట్ సబ్సిడీలు ఎత్తివేసిన ఘనత సిఎం కెసిఆర్‌దే

**సిద్దిపేట రూరల్, మే 23, ప్రభాతవార్త :** ఎకరాకు రూ.5 వేల రైతుబంధు ఇచ్చి గత ప్రభుత్వాలు ఇచ్చిన ఇన్‌పుట్ సబ్సీడిలు మొత్తం ఎత్తివేసిన ఘనత సిఎం కెసిఆర్‌కే దక్కుతుందని కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర కో-కన్వీనర్ నరసింహ్మారెడ్డి, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు బాలకృష్ణారెడ్డిలు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుందని దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యాన్ని వెంట వెంటనే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకునే బిఆర్ఎస్ సర్కారు రానున్న రోజుల్లో రైతుల ఆగ్రహంతోనే కూలిపోక తప్పదన్నారు. రైతు బంధు పేరిట రైతులను నట్టెట ముంచడమే బిఆర్ఎస్ సర్కారు పనిగా పెట్టుకుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే రైతులతో పాటు అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు.అనంతరం కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ బెజ్జంకి మండల అధ్యక్షులుగా రొడ్డ మల్లేశంను నియమిస్తూ నియామకం పత్రాన్ని అందజేశారు. సమావేశంలో రత్నాకర్‌రెడ్డి, దామోదర్, వెంకటేశ్వరరావు, శ్రావణ్, రాజు, రాజేందర్ పాల్గొన్నారు.

## కొనసాగుతున్న ఎల్లమ్మ వార్షికోత్సవ ఉత్సవాలు


అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

**తొగుట, మే 23, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పెద్దమాసాన్‌పల్లిలో శ్రీ మహా రేణుక ఎల్లమ్మ వార్షికోత్సవ ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి ఎల్లమ్మ జమదగ్ని కళ్యాణోత్స ఉత్సవాలలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అయన మాట్లాడుతూ అమ్మవారి దయతో అందరూ చల్లగా అయు ఆరోగ్యాలతో ఉండాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్, ఎంపిటిసి మెట్టు వరలక్ష్మీ స్వామి, మాష్టి సుమలత కనకయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది రాంరెడ్డి, మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు ఉల్లేంగుల సాయికుమార్, జర్నలిస్టులు బాలనర్సయ్య, కృష్ణగౌడ్,నర్సింలు, మహేష్,నాగరాజు, ఎండి షఫీ, ఉప సర్పంచ్ అల్వాల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతులు సంఘటితం కావాలి : వేణుగోపాల్‌రెడ్డి


రైతులతో మాట్లాడుతున్న దృశ్యం

**తొగుట, మే 23, ప్రభాతవార్త:** రైతులు సంఘటితం అయితేనే..బంగారు భవిత ఉంటుందని ఏకలవ్య ఫౌండేషన్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని వెంకట్రావుపేటలో రైతు ఉత్పత్తిదారుల సంఘంను అయన పరిశీలించి మాట్లాడారు. అసంఘటిత రంగంగా ఉన్న రైతులు తమ అభివృద్ధి కోం సంఘటితం కావాలన్నారు. సంప్రదాయ వరి పంట స్థానంలో అదాయం అందించే వాణిజ్య పంటలు సాగు చేయాలన్నారు. గ్రామాల్లో మహిళా, రైతు సంఘాలు ఏర్పాటు చేయాలన్నారు. రైతు ఉత్పత్తి సంఘాలలో పెద్ద ఎత్తున రైతులు సభ్యత్వం తీసుకోవాలన్నారు. జిల్లాలోని రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు డిసిఎంఎస్ ద్వారా ఎరువులు అందించాలని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్‌ను కలిశారు. కార్యక్రమంలో తొగుట రైతు ఉత్పత్తిదారుల సంస్థ చైర్మన్ జీడిపల్లి రాంరెడ్డి, ఏకలవ్య ఫౌండేషన్ రీజనల్ డైరెక్టర్ సంతోష్, సభ్యులు జీడిపల్లి గోవర్ధన్‌రెడ్డి, పాత్కుల బాలయ్య, సుతారి రాములు, చాట్లపల్లి నవీన్, సీఈఓ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## దళితుల భూములను అన్యాక్రాంతం చేస్తే సహిచం

### డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్


మాట్లాడుతున్న డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్

**మిరుదొడ్డి, మే 23, ప్రభాతవార్త :** దళితుల భూములను అన్యాక్రాంతం చేస్తే సహించేది లేదని..నయా భూస్వాముల అగడాలను అరికట్టకపోతే ఉద్యమం తప్పదని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ హెచ్చరించారు. మండల పరిధిలోని చెప్యాలలో అన్యాక్రాంతం అవుతున్న దళితుల భూములను మంగళవారం అయన పరిశీలించారు. మండల పరిధిలోని పెద్దచెప్యాల గ్రామంలోని సర్వే నంబరు 205/3లో దళిత కుటుంబాలకు ప్రభుత్వం అసైన్డ్ భూములను పంపిణీ చేయగా తరతరాలుగా వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్న భూములు తాను కొన్నానని దళితులు సాగు చేసిన వరి పంటను కొసుకోకుండా అడ్డుకుంటున్న కూర అంతయ్య, కిషోర్‌లు చర్యలు తీసుకోవాలన్నారు. దళితులకు కేటాయించిన భూముల్లోకి వస్తే చూస్తూ ఉరుకునే ప్రసక్తిలేదన్నారు. అంతయ్య పేదల నుంచి అక్రమంగా తీసుకున్న భూములను ప్రభుత్వం తీసుకొని తిరిగి పేదలకు అప్పగించాలని లేనిచో ఉద్యమం ద్వారా భూములను స్వాధీనం చేసుకుంటమన్నారు.

## దేశానికే ఆదర్శం కంటి వెలుగు కార్యక్రమం

### ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి

**నర్సాపూర్, మే 23.ప్రభాతవార్త:** తెలంగాణాలో చేపడుతున్నకంటి వెలుగు కార్యక్రమం దేశానికే ఆదర్శమని ,రాష్ట్రంలోఅంధత్వ నివారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం నర్సాపూర్ మండలంలోని తుజాల్‌పూర్ గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంబించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ కంటి సమస్యలను నివారించేందుకుగాను ఈ కంటి వెలుగు కార్యక్రమం ఎంతగానో ఉపయోగ పడుతుందని అన్నారు.. రాష్ట్రంలో కంటి వెలుగు కార్యక్రమంతో కంటి వ్యాధులున్నావారికి ఎంతో మేలు కలుగుతుందన్నారు.రాష్ట్రంలో కంటి వెలుగు కార్యక్రమానికి మంచి స్పందన లబిస్తుందని ఇప్పటికే 90 శాతం వరకు పూర్తయ్యిందని తెలిపారు. ఈమేరకు ప్రజలు ఈ కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మదనరెడ్డి సూచించారు.తుజాల్‌పూర్ గ్రామాన్ని అన్నిరంగాల్లో అబివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి హామీ ఇచ్చారు.ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో పాటు జడ్‌పిటిసీ బాబ్యానాయక్, పిఏసిఎస్ చైర్మన్ రాజుయాదవ్, మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బోగ చంద్రశేఖర్,గ్రామ సర్పంచ్ గాలి శ్రీరాములు,సర్పంచ్‌ల ఫోరం మండల అధనక్షులుజితేందర్‌రెడ్డి,ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, నాయకులు యాదగిరి,ఆంజనేయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


మృతి చెందిన గేదె దృశ్యం

## విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే పాడి గేదె మృతి

**కొల్చారం, మే 23, ప్రభాతవార్త:** విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి చెందిందని అంసానిపల్లి గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. మంగళవారం కొల్చారం మండలం అంసానిపల్లి గ్రామ శివారులో తోడిమె ఇప్పల వద్ద గ్రామానికి చెందిన పశువుల కాపరులు గొల్ల అశోక్ భార్యతో పాటు మరికొంత మంది పాడి గేదెలను యాధివిదిగా గ్రామ శివారులోని తొడిమె ఇప్పళ్ల గిరిజన తండా వైపు రోజు మాదిరిగి మేపేందుకు తీసుకుపోయారు. అక్కడ పశువులు వచ్చి గడ్డి మేస్తున్న క్రమంలో గొల్ల అశోక్‌కు చెందిన పాడి గేదె విద్యుత్ షాక్కుఉ గురై అక్కడికి అక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న కంసానిపల్లి సొసైటీ చైర్మన్ మన్నె రాములు స్థానిక రైతులతో కలిసి అక్కడికి వెళ్లి చూడగా ప్రమాదకరంగా నేలపై విద్యుత్ తీగలు పడి ఉన్నాయని తెలిపారు. ఈ విషయమై వెంటనే విద్యుత్ శాఖ ఏఈ హైమద్ అలీకి ఫోన్ ద్వార సమాచారం అందించగా విధి నిర్వాహణలో భాగంగా ఏనగండ్ల గ్రామంలో విద్యుత్ బకాయిలు వసూలు చేసేందుకు వెళ్లానని తెలపడం జరిగింది. బాధిత రైతుకు విద్యుత్ శాఖ తరఫున నష్ట పరిహారం అందించేందుకు భరోసా కల్పించారు. అనంతరం మండల రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ ప్రభాకర్ దృష్టికి తీసుకుపోగా వెంటనే స్పందించిన రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ ప్రభాకర్ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి పంచనామ నిర్వహించారు. పాడిగేడె విలువ సుమారు 80వేల రూపాయల వరకు ఉంటుందని అంచనా వేశారు. పంచనామ రిపోర్టును ఉన్నతాధికారులకు అందచేసి బాధిత రైతుకు న్యాయం చేసేలా కృషి చేస్తానన్నారు. అంసానిపల్లి సొసైటీ చైర్మన్ రాములు, బాధిత కుటుంబాన్ని విద్యుత్ అదికారులు, ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

### -పాతంశెట్టి కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి


వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారి ఆశా కుమారి దృశ్యం

**కొల్చారం, మే 23, ప్రభాతవార్త:** మెదక్ జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు చేసే సమయంలో చెత్త, పొల్లు లేకుండా అవసరమైన జాగ్రత్తలు పాటించాలని మెదక్ జిల్లా వ్యవసాయ అధికారి ఆశా కుమారి అన్నారు. ఈ మేరకు మంగళవారం కొల్చారం మండలంలోని పోతంశెట్టి పల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు ఎంత కొనుగోలు జరిగింది, ప్రస్తుతం ఇంకా ఎంత రెడీగా ఉంది, ఇంక ఎంత కొనుగోలు చేయాలనే వివరాలతో పాటు గోనె సంచులు, హమాలీలలకు సంబంధించి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అనే వివరాలను అడిగితెలుసుకున్నారు. ఈ విషయంలో రైతులకు ఏమైనా ఇబ్బందులు వస్తే తమకు తెలియచేయాల్సిందిగా జిల్లా వ్యవసాయ అధికారిణి ఆశాకుమారి అక్కడ ఉన్న రైతులకు తెలిపారు. ధాన్యం త్వరగా రైస్ మిల్లులకు చేరేలా అవసరమైన ఏర్పాటు చేశామని రైతులు, దాన్యంలో చెత్తా , పొల్లు లేకుండా తేమ శాతం 17కంటే తక్కువగా ఉండేలా చూసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ప్రతిభ, ఐకెపి సెంటర్ ఇంచార్జి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలు రాగానే వచ్చిపోయే రాజకీయ, స్వచ్ఛంద సంస్థల నాయకుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### ఎంపిటిసిల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రవీందర్

**సిద్దిపేట రూరల్, మే 23, ప్రభాతవార్త :** ఎన్నికల రాగానే వివిధ రాజకీయ పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థల పేరిట మరికొంత మంది నాయకులు వస్తూపోతుంటారని వారి పట్ల జిల్లా ప్రజలు అ ప్రమత్తంగా ఉండాలని ఎంపిటిసిల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ అన్నారు. మంగళవారం అయన సిద్దిపేటలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలు ముగియగానే వెళ్లే పోయే నాయకుల మాటలు నమ్మొద్దన్నారు. సిద్దిపేట జిల్లా పేరు యావత్ దేశం గర్వించేలా చేసిన ఘనత సిఎం కెసిఆర్‌కే దక్కుతుందన్నారు. జిల్లాకు చెందిన మంత్రి హరీష్‌రావు 18 గంటలు ప్రజల కోసం పని చేస్తున్నారని తెలిపారు. సిఎం కెసిఆర్, మంత్రి హరీష్‌రావుల అధ్వర్యంలో జిల్లా అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. కొంత మంది మంత్రి హరీష్‌రావుపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని సమయం వచ్చినప్పుడు ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో వచ్చిపోయే వారికి కర్రుకాల్చి వాత పెట్టాలన్నారు.

## పంట నష్ట పరిహారం వెంటనే చెల్లించాలి

### రైతు సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు : భైరవరెడ్డి

సిద్దిపేట రూరల్, మే 23, ప్రభాతవార్త : అకాల వర్షాల వలన పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేలు వెంటనే చెల్లించాలని రైతు సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు గడీల భైరవరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘాల సమాఖ్య జిల్లాశాఖ సమావేశం మంగళవారం మార్కెట్ కమిటీ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి మద్దతు ధరను చెల్లించాలన్నారు. లక్ష రూపాయల వరకు పంట రుణ మాఫీ చేయాలన్నారు. కల్లాల నుంచి కొనుగోలు కేంద్రం వరకు రవాణా, హమాలీ ఖర్చులు ప్రభుత్వమే భరించాలన్నారు. సమగ్ర భూ సర్వే చేయించి రైతుల మధ్య భూతగాదాలను తొలిగించాలన్నారు. మిల్లర్లు తరుగు పేరిట చేసే దోపిడిని అరికట్టాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు రాజేంద్రప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీరాంరెడ్డి, జిల్లా నాయకులు పి.రంగారెడ్డి, డి.నర్సింహ్మారెడ్డి, పి.వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మ వార్షికోత్సవంలో ప్రత్యేక పూజలు


కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న గౌడ సంఘం నాయకులు

**తొగుట, మే 23, ప్రభాతవార్త :** మండల పరిధిలోని పెద్దమాసాన్‌పల్లి ఎల్లమ్మ జమదగ్ని మహర్షి కళ్యాణ మహోత్సవాన్ని గౌడ సంఘం అధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఉత్సవాలలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీనివాస్‌రెడ్డి అధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.కాగా దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో తొగుట ఎంపిపి గాంధారి లత నరేందర్‌రెడ్డి, సర్పంచ్, బిజెపి మండల పార్టీ అధ్యక్షులు చిక్కుడు చంద్రం, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు అక్కం స్వామి, కూచి మహిపాల్‌రెడ్డి,నవీన్, నిరంజన్‌రెడ్డి, శ్రీనాకర్‌రెడ్డి, అశోక్, బాబు రమేష్,బుచ్చాగౌడ్, అంజగౌడ్, బిజెపి నాయకులు విభీషణ్‌రెడ్డి పాల్గొన్నారు.

## శ్రీనివాస నిధికి లక్షరూపాయల విరాళం

**రామాయంపేట, మే 23, ప్రభాతవార్త :** రామాయంపేట పట్టణంలోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయం అభివృద్ధికోసం ప్రతిరోజు దాతు ముందుకు వస్తూ స్వామి వారిక ఏదో ఒక రూపంలో మొక్కులను చెల్లించుకుంటున్నారు. రోజురోజుకు ఇక్కడి వెంకటేశ్వర దేవాలయం అభివృద్ధి పథంలో ముందువెళ్తూ భక్తుల సంఖ్య రోజుకు పెరుగుతుంది. తాజాగా మంగళవారం నాడు రామాయంపేట పట్టణానికి చెందిన టీఆర్ఎస్ పార్టీ నాయకుడు రెవెన్యూ డివిజన్ జేఏసీ నాయకుడు ఎనిశెట్టి అశోక్‌గుప్తా వారి కుమారుడు మనీష్, కూతురు సింధు, భార్య శ్రీవాణి లతో కలిసి శ్రీ వెంకటేశ్వరస్వామి గుడికి వెళ్లి, అక్కడ స్వామివారి కోసం ఏర్పాటుచేసిన శ్రీనివాస నిధికి తనవంతు సహాయంగా ఒక లక్ష రూపాయలు నగదును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.


నియామకం పత్రాన్ని అందుకుంటున్న దృశ్యం

## కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడి ఎన్నిక

**బెజ్జంకి, మే 23, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ నూతన మండల అధ్యక్షులుగా మండల కేంద్రానికి చెందిన రొడ్డ మల్లేశంను నియమించినట్లు మంగళవారం కిసాన్ సెల్ రాష్ట్ర నాయకులు నాయిన నరిసింహ్మారెడ్డి, జిల్లా అధ్యక్షులు బాలకృష్ణారెడ్డి తెలిపారు. ఈ మేరకు మల్లేశంకు నియామకం పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ మండలంలో కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్‌ను మరింత పటిష్టం చేయడంతో పాటు రైతు సమస్యలపై తన వంతు పోరాటం చేస్తానని తెలిపారు. రైతు సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి పదవి అప్పగించిన పదవి రావడానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు ముక్కిస రత్నాకర్‌రెడ్డి, నాయకులు శానగొండ శ్రావణ్, ఒగ్గు దామోదర్, దోనె వెంకటేశ్వరరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా ఆసుపత్రి ప్రధాన మార్గం


ధ్వంసమైన దారి

**బెజ్జంకి, మే 23, ప్రభాతవార్త:** మండల పరిధిలోని తోటపల్లి గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక అరగ్యో కేంద్రంలోని ప్రధాన మార్గం వద్ద దారి ధ్వంసమై రాకపోకలకు ఇబ్బందిగా మారింది. చుట్టూ ఉన్న నాలుగు గ్రామాల ప్రజలకు తోటపల్లి గ్రామంలోని ప్రభుత్వ అసుపత్రి అందుబాటులో ఉండగా నిత్యం రోగులు, గర్భిణీలు, వృద్దులు పలు వైద్య పరీక్షలు, చికిత్సల నిమిత్తం వస్తూ ఉంటారు. ఇటీవల ప్రధాన గేటు వద్ద ఎర్పడిన గుంత వలన రాకపోకలు ఇబ్బందిగా మారిందని ఎద్దైనా ప్రమాదం జరగకముందే సంబంధిత అధికారులు సత్వరమే గేటు వద్ద మరమ్మత్తుల చర్యలు చేపట్టాలని అసుపత్రికి వచ్చే రోగులు కోరుతున్నారు.

## సిఎం కేసిఆర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం


కేసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కార్యదర్శులు

**కౌడిపల్లి, మే 23, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రాష్ట్ర సిఎం కేసిఆర్ క్రమబద్ధీకరణ చేస్తున్నట్లు హామి ఇవ్వడంతో మంగళవారం నాడు ఎంపిడిఓ కార్యాలయం ఎదుట సిఎం చిత్ర పటాన్నికి క్షీరాభిషేకం చేశారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులు జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీన్ రెడ్డి ఆధ్వర్యంలో కౌడిపల్లి మండల పంచాయతీ కార్యదర్శులు సిఎం చిత్ర పటాన్నికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతు రాష్ట్ర సిఎం జూనియర్ పంచాయతీ కార్యదర్శులపై పెట్టిన బాధ్యతను తమ నైతిక విధిలో భాగంగా పూర్తి చేస్తామని ఆయన హామి ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఈయన తోపాటు మండలంలోని ఆయా పంచాయతీలలో పనిచేస్తున్న కార్యదర్శులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు


దుకాణాలలో తనిఖీలు చేస్తున్న వ్యవసాయాధికారి ప్రవీణ్,ఎస్ఐ

**చిన్నశంకరంపేట,మే23, ప్రభాతవార్త:** నకిలి విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి లక్ష్మీ ప్రవీణ్,ఎస్ఐ పోచయ్యలు హెచ్చరించారు. మంగళవాం మండల పరిధి చిన్నశంకరంపేట పట్టణంలోని విత్తనాల దుకాణాలలో ఎస్ఐ పోచయ్య, వ్యవసాయాధికారి లక్ష్మీ ప్రవీణ్‌లు తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వ అనుమతి పొందిన విత్తనాలను నిర్ణిత ధరలకే విక్రయించాలని, అనుమతి లేని విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు సైతం విత్తనాల కొనుగోలులో అప్రమత్తంగా ఉండాలని, ఎవరైన నకిలీ విత్తనాలు అమ్మితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. రైతులు తీసుకున్న విత్తనాలకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని, విత్తనాల వివరాలను రికార్డులో పొందుపర్చాలని తెలిపారు.

## కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభీషేకం

**చిన్నశంకరంపేట,మే23, ప్రభాతవార్త:** జేపిఎస్‌లను క్రమబద్ధీకరించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రుణపడి ఉంటామని జెపీఎస్‌ల మండల అధ్యక్షుడు రజనీకాంత్ అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి ఉద్యోగ బధ్రత కల్పించారన్నారు. అనంతరం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభీషేకం చేశారు. ఎంపీడీవో ప్రవీణ్, ఎంపీపీ భాగ్యలక్ష్మీరెడ్డిలకు మిఠాయిలను తినిపించారు. కార్యక్రమంలో జేపీఎస్‌నాయకులు వెంకటేష్, రమేష్, సుహాసిని, జ్యోతి తదితరులున్నారు.

## నిధులు మంజూరు : పట్లోరి రాజు

**చిన్నశంకరంపేట,మే23, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ పాలనలోనే రాష్ట్రం అభివృద్ధి చెందిందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పట్లోరి రాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్థానిక విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా వివిధ గ్రామాలలో నిర్మించే కమ్యూనిటీ హల్, పంచాయతీ కార్యాలయాలు, భవనం, వైద్య ఉప కేంద్రం భవనాలకు రూ.60లక్షలు నిధులు మంజూరైనట్లు ఆయన తెలిపారు. నిధులు మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షులు లక్ష్మారెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పూలపల్లి యాదగిరి యాదవ్, వివిధ గ్రామాల సర్పంచులు,ఎంపీటీసీలు, నాయకులు పాల్గోన్నారు.

### అరబిందో రియాల్టీ తెలంగాణ స్క్వాష్ ఓపెన్

అరబిందో రియాల్టీ తెలంగాణ స్క్వాష్ ఓపెన్‌లో సెమీ-ఫైనల్‌లు సికింద్రాబాద్ క్లబ్‌లో ముగిశాయి. రేపు చివరి ముఖాముఖికి ఆటగాళ్ల ఉద్భవించారు. హైదరాబాద్ స్క్వాష్‌లో ధనూజ్ ఫైనల్స్‌కు అర్హత సాధించారు.

## రైతులకు అండగా కేసీఆర్ ప్రభుత్వం : ఎమ్మెల్యే



రైతులకు జీలుగ విత్తనాలను అందజేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

**నారాయణఖేడ్, మే 23 ప్రభాతవార్త:** రైతులకు తెరాస ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపా ల్‌రెడ్డి అన్నారు.మంగళవారం నారాయణఖేడ్ మండల వ్యవసాయ కార్యాలయంలో రైతులకు జనుము, జీలుగ విత్తనాలను ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు తెరాస ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. దేశంలో లేని పథకాలు ప్రవేశపెట్టి రైతులకు ఆదుకుంటున్నారన్నారు. వచ్చే వర్షకాలం కొరకు 40 క్వింటాళ్ల జనుము, 533 క్వింటాళ్ల జీలుగ అందుబాటులో ఉన్నాయని అన్నారు. ప్రభుత్వం రాయితీపై ఇస్తున్న పచ్చిరొట్ట ఎరువుల వల్ల భూసారం పెరుగుదలతో పాటు పెట్టుబడి ఖర్చు తగ్గించుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జి ఏడీఏ కె.శంకర్, నియోజకవర్గంలోని ఆయా మండల వ్యవసాయాధికారులు శశాంక్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశం, మండల రైతు కో ఆర్డినేటర్ సత్యపాల్‌రెడ్డి, నాయకులు ఎంపీపీ తనయులు రమేష్‌చౌహన్, పీఏసీఎస్ ఛైర్మన్ గంగాపూర్ ఛైర్మన్‌నర్సింహరెడ్డి, నిజాంపేట ఎంపీటీసీ లింగారెడ్డి,నాయకులు ప్రభాకర్, ఆయా మండలాల ఏఈఓలు, ఆత్మ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పరామర్శ



కుటుంబ సభ్యులకు పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి

**సిర్గాపూర్, మే 23 ప్రభాతవార్త:** సిర్గాపూర్ మండల కేంద్రానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సినియర్ నాయకులు హెచ్‌పీ గ్యాస్ బాబు తండ్రి మ్యతారి కిష్టయ్య మరణించాడు. మంగళవారం ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి మరణవార్త తెలుసుకుని కుటుంబ సభ్యులకు పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడు అండగా ఉంటానని తెలిపారు. ఎమ్మెల్యే వెంట సిర్గాపూర్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు సంజీవరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు యాదవరావు, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ పటేల్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు గ్రామ ఎస్సీ సెల్ అధ్యక్షులు సాయిలు, నర్సగౌడ్, తదితరులు ఉన్నారు.

## గంగ్వార్‌లో ఎరువుల దుకాణం తనిఖీ



ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ లావణ్య

**న్యాల్‌కల్, మే 23, ప్రభాతవార్త:** మండలంలోని గంగ్వార్ గ్రామ చౌరస్తాలో నిర్వహిస్తున్న రైతు మిత్ర ఎరువుల దుకాణాన్ని మంగళవారం మండల వ్యవసాయ అధికారిణి ఎన్ లావణ్య పరిశీలించారు. దుకాణంలో నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించారు. రైతులకు అందచేసే ఎరువులు, విత్తనాలు, మందులకు సంబంధించి విధిగా రశీదులు అందించాలని దుకాణం నిర్వాహకులకు ఏఓ లావణ్య సూచించారు.

## వివోఏలపై అక్రమ వేధింపులు ఆపాలి
### -సిఐటియు జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య



గజ్వేల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న వివోఏలు

**గజ్వేల్, మే 23 (ప్రభాతవార్త):** ఐకెపి వివోఏల సమ్మె రాష్ట్ర వ్యాప్తంగా 36 రోజులుగా చేయడం జరుగుతుందని సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య పేర్కొన్నారు. మంగళవారం వివోఏలు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఫ్లకార్డులతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజాస్వామ్యబద్ధంగా చర్చలు జరపకుండా ఏపిఎం, గ్రామ సమాఖ్య సంఘాల ద్వారా షోకాజ్ నోటీసులు జారీచేస్తూ అక్రమ వేధింపులకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. గత 9 సంవత్సరాలుగా వేతనాలు పెంచాలని ఎదిరిచూస్తున్న వివోఏలపై చిన్నచూపు ఎందుకని విమర్శించారు. మంత్రుల దృష్టికి తీసుకెళ్ళినా పరిష్కరించకపోవడంతో ఆర్టికల్ 19 ప్రకారం యూనియన్లు పెట్టుకునే హక్కు రాజ్యాంగం కల్పించిందన్నారు. సమ్మె నోటీసులను సెర్ప్ సిఈఓ, జిల్లా పిడిలకు, ఏపిఎంలకు, ఐకెపి ఉద్యోగ సంఘాలకు ముందుగానే సిఐటియు అందజేయడం జరిగిందన్నారు. ఎన్నికల సమయంలో వివోఏలకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేస్తామని, బీమా సౌకర్యం, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి గుర్తింపు కార్డులు ఇస్తామని చెప్పి ఇంత వరకు చేయలేదని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే షోకాజ్ నోటీసులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి రంగారెడ్డి, వెంకటచారి, వివోఏలు లిఖిత, బిక్షపతి, లత, రేణుక, సంతోష, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

## నిధులకు కొరత లేదు : మాదాసు శ్రీనివాస్

**గజ్వేల్, మే 23 (ప్రభాతవార్త):** గజ్వేల్ మండలం ఊహించని విధంగా అభివృద్ధి జరిగిందని మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అమరావతి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఎంసి చైర్మన్ మాదాసు శ్రీనివాస్ మాట్లాడుతూ గజ్వేల్ మండలంలో నిధుల కొరత లేదని, సిఎం కెసిఆర్, మంత్రి హరీష్‌రావుల సహకారంతో అభివృద్ధి జరిగిందన్నారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళడానికి సర్పంచ్‌లు, ఎంపిటిసిలు ముఖ్య పాత్ర వహించాలన్నారు.

### ఎంపిటిసిగా ఉండి ఏమి చేయలేకపోతున్నా : ఎంపిటిసి

ఎంపిటిసిగా ఉండి ప్రజలకు ఏమి చేయలేకపోతున్నానని మండల సర్వసభ్య సమావేశంలో కొల్గూరు ఎంపిటిసి జ్యోతిస్వామి అన్నారు. ఎంపిటిసిగా ఎలాంటి గౌరవం లేదని, అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రణాళికాబద్ధంగా గ్రామాల్లో అభివృద్ధి జరగడంలేదని, తన ఎంపిటిసి పదవి అలంకార ప్రాయంగా మిగిలిందని వాపోయారు. అధికారుల అలసత్వం వల్ల అసంపూర్తి అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేసే బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ మశ్చేందర్, జెడ్‌పిటిసి పంగ మల్లేశం, వైస్ ఎంపిపి కృష్ణగౌడ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు చెరుకు చంద్రమోహన్‌రెడ్డి, ఎంపిటిసిల ఫోరం జిల్లా అధ్యక్షుడు అశోక్, ఎంపిటిసి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలతో సుభిక్షంగా ప్రజలు : ఎమ్మెల్యే



చెక్కులు అందచేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు దృశ్యం

**జహీరాబాద్, మే 23, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా జీవనం సాగిస్తున్నారని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. మంగళవారం జహీరాబాద్ పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 261 మంది లబ్దిదారులకు 2 కోట్ల 61లక్షల 30వేల 276 రూపాయల కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు సుభిక్షంగా ఉండాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జె స్వామి, ఆత్మకమిటి చైర్మన్ పెంటారెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ గుండప్ప, ఇప్పెపల్లి సొసైటీ చైర్మన్ దాసరి మచ్చుందర్, ఎస్సీఎస్టీ విజిలెన్స్ కమిటి సభ్యులు బంటు రామకృష్ణ, జహీరాబాద్ బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు సయ్యద్ మోహియోద్దిన్, కేతకి ఆలయ కమిటి చైర్మన్ నీల వెంకటేశం, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు తాజుద్దీన్, మాజీ జడ్పీటిసి సభ్యులు మాణెమ్మ, మాజీ మున్సిపల్ చైర్మన్‌లు మంకాల్ సుభాష్, మురళిక్రిష్ణ గౌడ్, మాజీ కౌన్సిలర్లు రాములు నేత, సర్పంచ్‌లు విజయ్, మాణిక్‌రెడ్డి, ఎంపిటిసి సభ్యులు బస్వరాజ్, నాయకులు వైజనాథ్, ఇజ్రాయిల్ బాబి, మిథున్‌రాజ్, కాశీనాథ్, జియాగౌరి, పుణ్యమ్మ, జమీల్, గౌసోద్దిన్, కళ్లెం చంద్రయ్య, తెకుమట్ల గణేష్, మోయిస్, హీరు రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి రాజు రూ.40వేల విరాళం



రాజును సన్మానిస్తున్న ఆలయ కమిటి బాధ్యుల దృశ్యం

**సదాశివపేట, మే 23, ప్రభాతవార్త:** మండలంలోని పొట్టిపల్లి గ్రామంలో కొనసాగుతున్న శ్రీ మల్లికార్జున, బీరప్పస్వామి జాతర ఉత్సవాల్లో మంగళవారం బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, పిఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ పులిమామిడి రాజు పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జాతర ఉత్సవాలకు హాజరైన రాజును ఆలయ ఉత్సవ కమిటి బాధ్యులు సాధరంగా స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా రాజు ఆలయంలో అర్చకులు మంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి తన వంతుగా 40వేల రూపాయలను కమిటి బాధ్యులకు అందచేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, పిఎంఆర్ యువసేన నాయకులు పాల్గొన్నారు.

### బసవేశ్వర విగ్రహం ఏర్పాటుకు 25వేల విరాళం

సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని మక్త అల్లూర్ గ్రామంలో మహాత్మా విశ్వగురు బసవేశ్వరుడి విగ్రహం ఏర్పాటుకు 25వేల రూపాయల విరాళాన్ని అందిస్తానని బిఆర్ఎస్ రాష్ట్ర నేత, పిఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ పులిమామిడి రాజు గ్రామ వీరశైవలింగాయత్ బాధ్యులకు హామి చేశారు. మంగళవారం మక్తఅల్లూర్ గ్రామ వీరశైవ లింగాయత్‌లతు రాజు చెంతకు చేరుకుని గ్రామంలో బసవన్న విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్లు తెలుపడంతో వెంటనే స్పందించిన ఉరాజు విగ్రహం ఏర్పాటుకు 25వేల అందిస్తారని హామి చేశారు. కార్యక్రమంలో ముక్త అల్లూర్ వీరశైవులు పాల్గొన్నారు.

## మహాగర్జన వాల్ పోస్టర్ ఆవిష్కరణ
### 4న చలో కొత్తగూడెంకు తరలిరావాలి : సిపిఐ జిల్లా కార్యదర్శి జలాలోద్దిన్



మహాగర్జన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఐ నాయకుల దృశ్యం

**జహీరాబాద్, మే 23, ప్రభాతవార్త:** కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు, బిజెపి అరాచకాలను అణిచివేసేందుకు జూన్ 4వ తారీఖున కొత్తగూడెంలో నిర్వహిస్తున్న మహాగర్జనకు పెద్ద సంఖ్యలో తరలిరవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలోద్దిన్, డివిజన్ కార్యదర్శి కె నర్సింలులు సూచించారు. మంగళవారం పట్టణంలోని సిపిఐ కార్యాలయ ఆవరనలో మహాగర్జన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా జలాలోద్దిన్ మాట్లాడుతూ పేదల జీవితాలతో బిజెపి ప్రభుత్వం ఆటలాడుకుంటోందని, ధరలు ఆకాశానికి అంటడటంతో ప్రజలు కొనే పరిస్థితిలో లేరని ఆందోళన వ్యక్తం చేశారు. పెట్టుబడి దారులకు బిజెపి ప్రభుత్వం దోచిపెడుతోందని విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు పరంచేసి కార్మికుల జీవితాలతో ఆటలాడుకోవడం సరికాదని హెచ్చరించారు. కులాల, మతాల పేరుతో రాజకీయం చేయడం శోచనీయమని దుయ్యబట్టారు. భారత దేశం అంతటా సిపిఐ ఆధ్వర్యంలో ఏప్రిల్ 25 నుంచి జూన్ 4వ తారీఖు వరకు ప్రజా పోరు జీపు జాతలను నిర్వహిస్తున్నట్లు, 4న కొత్తగూడెంలో ముగింపు మహాగర్జన బహిరంగ సభను ప్రకాశం స్టేడియంలో 1లక్షల మందితో నిర్వహిస్తున్నట్లు వివరించారు. సిపిఐ డివిజన్ కార్యదర్శి కెనర్సింలు, హెచ్ రాజు, సుధాకర్, మొ గులయ, జహాంగీర్, విశ్వనాథ్,తాజోద్దిన,ఇర్ఫాన్, మోయిద్దీన్, తాజోద్దిన్ పాల్గొన్నారు.

## ఆర్మీ శిక్షణకు 20 మంది ఎంపిక.. ఉచితంగా శిక్షణ



ఆర్మీ శిక్షణకు ఎంపిక అభ్యర్థులకు సూచనలు చేస్తున్న ఫౌండేషన్ బాధ్యులు

**మనూర్, మే 23, ప్రభాతవార్త:** ఆర్మీలో ఉద్యోగాలు అందుకునేందుకు అవసరమైన శిక్షణను అన్ని సౌకర్యాలతో ఉచితంగా అందించేందుకు ఎస్ఐబి ఫౌండేషన్, భవిష్య భారత్ ముందుకు వచ్చింది. మండలంలోని రాయిపల్లి గ్రామంలో 2 నెలల పాటు ఆర్మీలో శిక్షణ ఇప్పించేందుకు గాను అభ్యర్థులను ఎంపిక చేశారు. ఎంపికైన 20 మంది అభ్యర్థులకు ఎస్ఐబి ఫౌండేషన్, భవిష్య భారత్ ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ ఇవ్వడంతో పాటు భోజనం, వసతి, అవసరమైన మెటీరియల్‌ను అందించనున్నట్లు భవిష్య భారత్ బాధ్యులు వివరించారు. కార్యక్రమంలో గ్రామ సనార్పంచ్ రాంచంఎదర్, భవిష్య భారత్ సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.

## బొడ్రాయి ప్రతిష్ట వేడుకలు

**మర్కుక్, మే 23 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని సిఎం దత్తత గ్రామం నర్సన్నపేటలో నాబిశిల బొడ్రాయి ప్రతిష్ట వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం జెడ్‌పిటిసి మంగమ్మరాంచంద్రం, స్థానిక సర్పంచ్ మాధవి రాజిరెడ్డి, గ్రామస్తుల ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోశ్చరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మహిళలు బొడ్రాయికి జలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఊడెం శ్రీనివాస్‌రెడ్డి, కానుగంటి మహేందర్‌రెడ్డి, మాధవరెడ్డి, ఎల్లారెడ్డి, మహిపాల్‌రెడ్డి, బూకల పర్వతాలు, ఊడెం జశ్వంత్‌రెడ్డి, స్వామిరెడ్డి, శకటి ఐలయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మద్యం అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

**జహీరాబాద్, మే 23, ప్రభాతవార్త:** మద్యం అక్రమ రవాణా చేస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి వి రఘు హెచ్చరించారు. జిల్లా ఎస్‌పియం రమణకుమార్ ఆదేశాల మేరకు ఎక్సైజ్ పోలీసులతో కలిసి డిఎస్‌పి రఘు పట్టణంలోని రైల్వే స్టేషన్‌ను ఆకస్మికంగా పరిశీలించి కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వచ్చే రైళ్లను ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ సందర్భగా డిఎస్‌పి రఘు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోకి ఇతర రాష్ట్రాల నుంచి ఐఎంఎ ల్, చీఫ్ లిక్కర్ మధ్యాన్ని అక్రమంగా రైళ్లలో రవాణా చేస్తున్నట్లు సమాచారం అం దడంతో తనిఖీ చేశామన్నారు. ఇతర రాష్ట్రాల్లో తక్కువ ధరకు మధ్యంను కొనుగోలు చేసి తెలంగాణలో అధిక ధరలకు అమ్ముకుంటూ అక్రమంగా సంపాదించేందుకు కొందరు అక్రమార్కులు యత్నాలు చేస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. మద్యం రవాణా చేసే వారు ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీ లో జహీరాబాద్ పట్టణ, రూరల్ సిఐలు తోట భూమతి, నోముల వెంకటేశం, ఎక్సైజ్ సిఐ ఎం అశోక్‌కుమార్, ఎస్ఐలు కె శ్రీకాంత్, ఎం కాశీనాథ్, వినయ్‌కు మార్, రాజేందర్‌రెడ్డి, సురేష్:, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐలు పోలీసు సిబ్బంద పాల్గొన్నారు. జహీరాబాద్‌లోని రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేసేందుకు పెద్ద ఎత్తున పోలీసులు చేరుకోవడం చూసిన ప్రజలు, స్టేషన్‌లోని ప్రయాణీకులు భయభ్రాంతులకు గురయ్యారని చెప్పవచ్చు.

## దుబ్బాకలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

**దుబ్బాక, మే 23, ప్రభాతవార్త:** దుబ్బాక మండల కేంద్రంలోని 9350 మంది జూనియర్ పంచాయతీ రాజ్ కార్యదర్శులను తెలంగాణ సర్కార్ పర్మినెంట్ చేయడం హర్షించదగ్గ విషయమని దుబ్బాక మండల జూనియర్ పంచాయతీ సెక్రటరీ సంఘం అధ్యక్షులు పూర్ణచందర్, పంచాయతీ జనరల్ సెక్రటరీ మల్లేశం అన్నారు. మంగళవారం దుబ్బాకలోని కార్యాలయం ఎదుట సీఎం కేసీఆర్ చిత్రపటానికి జూనియర్ పంచాయతీ సెక్రటరీలు పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధిలో మరింత ఉత్సాహంతో పని చేస్తామన్నారు. సీఎం కేసీఆర్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జూనియర్, సీనియర్ పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

## క్రీడల్లో గెలుపు ఓటములు సహజం

**హుస్నాబాద్,మే23,ప్రభాతవార్త** క్రీడల్లో గెలుపు ఓటములు సహజం అని సామాజిక సేవకురాలు కర్ణకంటి మంజూలరెడ్డి అన్నారు.గత కొద్దిరోజులుగా మంజుల క్కయువసేన ఆధ్వర్యంలో నిర్వహించిన కేఎమ్ఆర్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ మంగళవారం నిర్వహించగా ఫైనల్‌కు చేరుకున్న హుస్నాబాద్,శివరాంపల్లి జట్లు తలపడ్డాయి.ఈ సందర్బంగా నిర్వహించిన మ్యాచ్‌లో శివరాంపల్లిపై హుస్నాబాద్ జట్టు విజయం సాధించింది.మొదటి స్థానంలో నిలిచిన హుస్నాబాద్ జట్టుకు ప్రైజ్ మనీ 1లక్షతో పాటు ట్రోఫి,ద్వితియ స్థానంలో నిలిచిన శివరాంపల్లి జట్టుకు రూ50వేలతో పాటు ట్రోఫి,మూడవ స్థానంలో నిలిచిన రన్నర్స్ జట్టుకు రూ25వేలతో పాటు ట్రోఫీ,నాలుగవ స్థానంలో నిలిచిన జట్టుకు రూ15వేలతో పాటు ట్రోఫీని మంజులరెడ్డి అందజేశారు.అనంతరం మంజులరెడ్డి మాట్లాడుతూ టోర్నమెంట్ విజయవంతం చేసిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ముత్యాల మల్లేషయాదవ్,రాజు,రాములు, రవిందర్‌తో పాటు మంజులక్క యువసేన సభ్యులు పాల్గొన్నారు.

## నర్సాపూర్ మున్సిపల్‌లో కొసాగుతున్న పారిశుధ్య పనులు

**నర్సాపూర్, మే 23.ప్రభాతవార్త:** నర్సాపూర్ మున్సిఫల్ పరిధిలోని కమీషనర్ సంచాలకులు పురపాలక పరిపాలనాధాకారి ఆదేశాల మేరకు పారిశుధ్య వారోత్సవాల్లో బాగంగా నర్సాపూర్ మున్సిఫల్ పరిధిలోమంగళవారం పారిశుధ్య పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ మేరకు నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 9 వ వార్డులో, 12 వ వార్డులోఈ పనులు ప్రారంబించగా ఈ కార్యక్రమంలో మున్సిఫల్ కమీషనర్ వెంకట్ గోపాల్, 9 వ వార్డు కౌన్సిలర్ సునీతా బాల్‌రెడ్డి, 12 వ వార్డు కౌన్సిలర్‌కుమ్మరి లక్ష్మినాగేష్ లు పాల్గొనగా వారి అధ్వర్యంలో ఈ వార్డుల్లో మురికి కాలువలు, రోడ్లు, పరిశుభ్రం,వీధిదీపాల మరమ్మత్తులు, తాగునీటి ట్యాంకల పరిశుభ్రం,పైప్‌లైన్ లలీకేజీలు, పిచ్చిమొక్కల ను తొలిగించడం వంటి పారిశుధ్య పనులు చేపట్టడం జరిగింది. ఇట్టి పనులను వారు స్వయంగా దగ్గరుండి చేయిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిఫల్ కమీషనర్ వెంకట్ గోపాల్,9 వ వార్డు కౌన్సిలర్ సునీతాబాల్‌రెడ్డి, 12 వ వార్డు కౌన్సిలర్ కుమ్మరి లక్ష్మినాగేశ్ లు మరియు పారి శుధ్య సిబబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేడు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో విత్తన మేళ

**నర్సాపూర్, మే 23.ప్రభాతవార్త:** రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించుటకుగాను ఈ నెల 24 న మండల పరిదిలోని నత్నాయపల్లిలోగల వ్యవసాయ పరిశోదన స్థానం అధ్వర్యంలో విత్తన మేళ, ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు నత్నాయపల్లి వ్యవసాయ పరిశోధనా స్తానం ప్రధాన శాస్త్రవేత్త టి.శోభ తెలిపారు. ఈసందరకర్బంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ యూనివర్సిటి నుండి విడుదలైన వివిద వరి, జనుము, జీలుగ రకాలకు సంబందించిన నాణ్యమైన విత్తనాలను విక్రయానికి అందుబాటులో ఉంచడంతో పాటు సమగ్ర సమాచారం గురించి అవగాహన కల్పిస్తారని తెలిపారు.ఈ మేరకు ఆసక్తి గల రైతులు ఈనెల 24 నజరిగే విత్తన మేళకు అధిక సంఖ్యలో తరిలి వచ్చి ఈ కార్యక్రమాఈన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.ఈ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో అందుబాటులో ఉన్న విత్తనాలు కెఎన్ఎం1638 సన్నరకం వరివిత్తనాలు,కెఎన్ఎం 118 కూనాలు సన్నాలు దొడ్డు రకం,జెజిఎల్ జగిత్యాల రైస్ దొడ్డు రకం వరి విత్తనలు అంబాటులో ఉండటంతో పాటు జనుము, జీలుగ విత్తనాలు అందుబాటులో ఉండగా విక్రయానికి సిద్దంగా ఉన్నాయని తెలిపారు.ఈ మేరకు రైతులు నాణ్యమైన ఈ విత్తనాలు నత్నాయపల్లి వ్యవసాయ పరిశోధన స్తానంలో తీసుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నత్నాయపల్లి వ్యవసాయ పరిశోధనా స్తానం ప్రధాన శాస్త్రవేత్త టి.శోభ తెలిపారు.

### అధికారులు లేక పురపాలక సంఘం సాదారణ సమావేశం వాయిదా

**నర్సాపూర్, మే 23.ప్రభాతవార్త:** ప్రభుత్వ అధికారులు హాజరు కాకపోవడం వల్ల నర్సాపూర్ పురపాలక సాదారణ సమావేశం వాయిదా పడింది. నర్సాపూర్ పురపాలక సమావేశం ఈ నెల 23 వ తేదీ మంగళవారం నిర్వహిస్తున్నామని అందరి ప్రభుత్వ అధికారులకు, పురపాలక సభ్యులకు అందరికి సమాచారం అందించినట్లు మున్సిఫల్ కమీషనర్ వెంకట్‌గోపాల్ తెలిపారు.ఈ మేరకు పురపాలక సంఘం సాదారణ సమావేశానికి మున్సిఫల్ చైర్మన్ మురళీయాదవ్ తో పాటు కౌన్సిలర్‌లు అందరు హాజరయ్యారు కాగా ఈసమావేశానికి ఏ ఒక్క ప్రభుత్వ అధికారి కూడ హాజరు కాలేక పోయారు. అయితే చివరగా పిఆర్ ఏఈ స్వామిదాస్, మున్సిఫల్ ఏఈ కిష్టయ్యలు హాజరు కాగా వారు వచ్చే లోపే సభ్యులందరు ప్రభుత్వ అధికారులు హాజర కాకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఈ పురపాలక సాదారణ సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించబంతో ఈ సమావేశం వాయిదా పడింది. కాగా ఈ పురపాలక సంఘం సాదారణ సమావేశం ఎప్పుడు నిర్వహించేదో తెలియ జేస్తామని మున్సిఫల్ కమీషనర్ వెంకట్‌గోపాల్ తెలిపారు. ఈ మేరకు అందరు సభ్యులు ఈ సమావేశం నుండి వెళ్ళి పోయారు.

## మహంకాళమ్మ విగ్రహ ప్రతిష్ట

**మర్కుక్, మే 23 (ప్రభాతవార్త):** మండలకేంద్రం మర్కుక్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ మహంకాళమ్మ దేవాలయంలో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా గ్రామ పురోహితులు మాధవశర్మ బృందం మంత్రోశ్చరణల నిర్వాహకులు నర్సింహ్మారెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా ఉదయం 8 గంటల నుండి దేవతా మూర్తులకు ప్రత్యేక పూజలు, మూలమంత్ర హవనం, ధాన్యాదివాసం, పుష్పాదివాసం, శయ్యాదివాసం, మంగళహారతి, యంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డిసి చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఎంపిపి పాండుగౌడ్, వైస్ ఎంపిపి బాల్‌రెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ భాస్కర్, ఎంపిటిసి చైతన్యశంకర్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి గీత రాంరెడ్డి, వార్డు సభ్యులు ప్రశాంత్‌రెడ్డి, బాపురెడ్డి, రాంరెడ్డి, మహేష్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించిన ఎఫ్‌డిసి చైర్మన్

**మర్కుక్, మే 23 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని సిఎం దత్తత గ్రామం ఎర్రవల్లిలో మంగళవారం ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఎంపిపి పాండుగౌడ్, వైస్ ఎంపిపి బాల్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ భాగ్యబిక్షపతితో కలిసి కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లతో పాటు కంటి అద్దాలను అందజేస్తామన్నారు.ఎంపిటిసి ధనలక్ష్మికృష్ణ, పిఏసిఎస్ వైస్ చైర్మన్ బాలరాజు, ఉపసర్పంచ్ కనకయ్య, నాయకులు ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

### మర్కుక్‌లో కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేస్తూ ఆదేశాలు జారీ చేయడంతో మంగళవారం మండలకేంద్రం మర్కుక్‌లో జూనియర్ గ్రామపంచాయతీ కార్యదర్శులు ఎఫ్‌డిసి చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఎంపిపి పాండుగౌడ్, వైస్ ఎంపిపి బాల్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ భాస్కర్‌లతో కలిసి ముఖ్యమంత్రి కేసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.



పోస్టర్ ఆవిష్కరించి ర్యాలీ నిర్వహిస్తున్న లింగాయత్‌ల దృశ్యం

## లింగాయత్ మహార్యాలీ పోస్టర్ ఆవిష్కరణ

**నాగల్‌గిద్ద, మే 23, ప్రభాతవార్త:** జూన్ 4వ తారీఖున హైద్రా బాద్‌లోని ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహించనున్న లింగాయత్ మహార్యాలీని విజయవంతం చేయాల్సిన అవసరం ప్రతి వీరశైవుడిపై, మహాత్మా బసవేశ్వరుడి భక్తులు, అభిమానులపై ఉందని వీరశైవలింగాయత్‌లు అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన నాగల్‌గిద్దలో మహార్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరించి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మకమిటి డైరెక్టర్ నాగిశెట్టి పాటిల్ మాట్లాడుతూ వీరశైవులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికే హైద్రాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ అనిల్, నాయకులు బస్వరాజ్ పాటిల్, కళ్యాణ్‌రావు, గురప్ప పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

## నిధుల మంజూరుకు కమిషనర్‌కు వినతి



జిహెచ్‌ఎంసి కమిషనర్‌కు నిధుల మంజూరుకై వినతి పత్రం అందచేస్తున్న కార్పోరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి దృశ్యం

**రామచంద్రాపురం, మే 23, ప్రభాతవార్త:** భారతీ నగర్ డివిజన్ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనులకు గాను ప్రతిపాదించిన 5 కోట్ల రూపాయలను మంజూరు చేయాలని భారతీ నగర్ కార్పోరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి జిహెచ్‌ఎంసి కమీషనర్ లోకేశ్‌కుమార్‌కు మంగళవారం వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా కార్పోరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి మాట్లాడుతూ స్పెషల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ గ్రాంట్ నిధుల కింద డివిజన్‌లో గల ఎంఐజి, ఎచ్ఐజి, బొంబాయి కాలనీ, ఎల్ఐజి కాలనీల్లో సిసి రోడ్డు, బిటి రోడ్ల నిర్మాణానికి 5 కోట్ల రూపాయల ప్రతిపాదనలు పెట్టినట్లు వివరించారు. పంపిని ప్రతిపాదనలకు అవసరమైన నిధులను మంజురు చేయాలని కమీషనర్‌కు వినతి పత్రం అందించినట్లు పేర్కొన్నారు. డివిజన్ అభివృద్ధికి మంత్రి తన్నీరు హరీష్‌రావు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిలు తమ వంతు సహకా రం అందిస్తున్నారన్నారు. బొంబాయి కాలనీలో మిని ఫంక్షన్ హాల్ నిర్మాణానికి మంజురు చేసి టెండర్‌లను ఆహ్వానించాలని కోరినట్లు తెలిపారు. కమీషనర్ లోకేష్‌కుమార్ నిధుల మంజూరుకు సానుకూ లంగా స్పందించినట్లు కార్పోరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి వివరించారు.

### నూతన వధువరులు ఆశీర్వదించిన ఎంపి బిబి పాటిల్

**న్యాల్‌కల్, మే 23, ప్రభాతవార్త:** మండలంలోని మెటల్‌కుంట గ్రామానికి చెందన బిఆర్ఎస్ నాయకులు, రేషన్ డీలర్ సంఘం మండల అధ్యక్షులు బేలూరు పాండురంగారెడ్డి కుమార్తె వివాహం రెండు రోజుల క్రితం అంగరంగ వైభవంగా జహీరాబాద్ పట్టణంలో ముగిసింది. పలు కారణాలతో వివాహానికి హాజరుకాలేకపోయిన ఎంపి బిబి పాటిల్ మంగళవారం మెటల్‌కుంట గ్రామానికి చేరుకుని పాండురంగారెడ్డి నివాస గృహంలో నూతన వధువరులను ఆశీర్వదించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ కమీషన్ సభ్యులు మహ్మద్ తన్వీర్, సిడిసి చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, గోవర్ధన్‌రెడ్డి, డిఆర్‌యూసి మెంబర్ షేఖ్ ఫరీద్, పాండు రంగారెడ్డి, నామా రవి కిరణ్ తదితరులు ఉన్నారు.

## కామారం గ్రామంలో చోరీ

**చిన్నశంకరంపేట,మే23, ప్రభాతవార్త:** తాళం వేసి ఉన్న మరో ఇంట్లో చోరి జరిగిన సంఘటన చిన్నశంకరంపేట మండలం కామారం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానిక ఇంచార్జి ఎస్ఐ పోచయ్య కథనం ప్రకారం.... గ్రామానికి చెందిన స్వరూప, కుమారుడు నగేష్ కొన్ని రోజుల నుండి గజ్వేల్ పట్టణంలో నివాసం ఉంటున్నారు. నగేష్ స్థానికంగా ఉన్న ద్విచక్రవాహనంలో విధులు నిర్వహిస్తుంటాడు. స్వరూప కూలీపనుల చేసుకుంటూ కుమారునికి చేదోడు, వాదోడుగా ఉంటుంది. సోమవారం వారు రేషన్ బియ్యం తిసుకోవడా నికి స్వగ్రామానికి రాగా ఇంటి తలుపులు పగులకొట్టి ఉండటం గమనించారు. ఇంట్లోకి వెళ్లి చూడగా బిరువాలోని వస్తువులు చిందరవందరగా పడేసి ఉన్నాయి. అందులోని అర తులం బంగారం, ఎడు తులాల మెట్టెలు, రెండు క్వింటాళ్ళ సన్న బియ్యం గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లినట్లు వారు తెలిపారు. ఆదివారం చిన్నశంకరంపేట పట్టణంలో, నేడు కామారంలో వరుస దొంగతనాలు జరుగడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. నగేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇంచార్జి ఎస్ఐ పోచయ్య తెలిపారు.

## రోడ్డును ఆక్రమించి ఇండ్లు నిర్మించిన వారిపై చర్యలు తీసుకోండి
### -మున్సిపల్ కమిషనర్‌కు కాలనీ వాసుల వినతి



వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

**హుస్నాబాద్‌టౌన్,మే23,ప్రభాతవార్త** పట్టణంలోని 17వ వార్డు సంజీవయ్య కాలనీలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ సందిలో రోడ్డును అక్రమంగా ఆక్రమించి ఇండ్లు నిర్మించిన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు మున్సిపల్ కమిషనర్ సుంకె రాజమల్లయ్యకు మంగళవారం రోజున వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ వార్డులో రోడ్డు 21 ఫీట్లు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 12 ఫీటు మాత్రమే ఉందని మిగతా పది ఫీట్ల రోడ్డును కొందరు అక్రమంగా ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారన్నారు.గత కొద్ది రోజుల క్రితం కాలనీకి చెందిన గడిపె విజయ్‌కృష్ణ అనే డ్రైవర్ కారు కిరాయికి వెళ్లి వచ్చి వారి ఇంటి ముందు పెట్టిన సమయంలో అదే కాలనీకి చెందిన అందె అజయ్ అనే వ్యక్తి కారులో వచ్చి ఆ కారును ఢీ కొట్టడంతో కారుకు సుమారు 20వేల నష్టం వాటిల్లిందన్నారు.ఈ ప్రమాదానికి కారణమైన రోడ్డును ఆక్రమించి అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన నిర్మాణాలను వెంటనే కూల్చివేసి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.ఈ విషయం స్థానిక కౌన్సిలర్‌కు నాలుగేండ్లుగా చెబుతున్నా అసలు పట్టించుకోవడం లేదన్నారు.

### ది లాంచ్ఆఫ్ మదర్ ఇండియా ప్రారంభం

మదర్స్ ఇండియాడే సందర్భంగా దుబాయ్‌లోని ప్రతిష్టాత్మకంగా అర్మానీహూటల్ బుర్జ్ ఖలీఫాలో మదర్ ఇండియా ప్రోగ్రాం ప్రారంభోత్సవం కార్యక్రమం జరిగింది. భారతదేశం యూఏఈ, సౌదీ ఆరేబియా, యునైటెడ్ కింగ్‌డమ్, జపాన్‌ల నుంచి ఇతర వ్యాపారవేత్తలు, ప్రతినిధులలో శశబిహాషేక్, లలితారాజ్ పండిట్, సలేహాష్వాల్ అల్ యామి, డాన్‌లుండ్‌క్విస్ట్‌లతో సహా పలువురు ప్రతినిధులుహాజరైన ఈ కార్య క్రమం అద్భుతమైన విజయాన్ని సాధించింది. మదర్ ఇండయా ప్రోగ్రామ్ గురించి వ్యవస్థాపకుడు నక్కా వెంకట్‌రావు మాట్లా డుతూ సాధ్యమైన అన్నివిధాలుగా తల్లులను గౌరవించడం గుర్తిం చడం మద్దతు ఇవ్వడం ద్వారా సమాజంలో సానుకూల మార్పుతీసు కురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.